పైడాకుల అశోక్ అన్న పుట్టినరోజు వేడుకలు




PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

సామాజిక చైతన్యానికి రావుగారి రచనలు అక్షర ఆయుధాలు




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 266 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- ఆదివారం 20 సెప్టెంబర్ 2026




# యూపీఐపై చార్జీల కత్తి

- ప్రజల చెల్లింపులపై కొత్త భారానికి రంగం సిద్ధం
- మోడీ సర్కారు డిజిటల్ మోడల్‌కు ఇదేనా కొత్త దిశ?
- డిజిటల్ ఇండియా అంటూ కేంద్రం ప్రచారం
- ఎండీఆర్ పేరుతో వినియోగదారులపై పరోక్ష వడ్డన!
- కేంద్రం నిర్ణయంపై ఆర్థిక నిపుణులు విస్మయం

**న్యూఢిల్లీ 19(పిసిడబ్ల్యూ న్యూస్):** డిజిటల్ ఇండియా.. నగదు రహిత ఆర్థిక వ్యవస్థ.. ఆర్థిక సాధికారత అంటూ ప్రచారం చేసుకుంటున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇప్పుడు యూపీఐ వ్యవస్థలో ఛార్జీల చర్చను తెరపైకి తెచ్చింది. ప్రజల రోజువారీ జీవితంలో అంతర్భాగంగా మారిన యూపీఐపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించే నిర్ణయం.. డిజిటల్ చెల్లింపుల సౌలభ్యంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ప్రజలకు ఉచితంగా, సులభంగా అందుబాటులో ఉన్న వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన సమయంలో.. నిర్వహణ ఖర్చుల పేరుతో కొత్త ఆర్థిక నమూనాను తీసుకురావడం ఎందుకు? ప్రజలపై పరోక్ష భారం పడనుందా? మిగతా2లో...

# వికసిత్ భారత్‌లో తెలంగాణది కీలక పాత్ర



- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రం
- దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ వాటాను 5 నుంచి 10 శాతానికి పెంచే దిశగా ప్రణాళిక
- ప్రభుత్వ రుణాలపై ఆధారపడే విధానం నుంచి ప్రయివేటు, సంస్థాగత పెట్టుబడుల సమీకరణ వైపు అడుగులు
- క్యూర్-ప్యూర్-రేర్ విధానంతో రాష్ట్రవ్యాప్తంగా సమతుల్య అభివృద్ధి
- 30 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీ
- యువతే తెలంగాణకు అతిపెద్ద బలం : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 19(పిసిడబ్ల్యూ న్యూస్):**వికసిత్ భారత్–2047 లక్ష్య సాధనలో తెలంగాణ కీలక పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దేశం నిర్దేశించుకున్న భారీ ఆర్థిక లక్ష్యాలను సుదూర ఆశయాలుగా కాకుండా, తక్షణ కార్యాచరణ బాధ్యతగా తెలంగాణ భావిస్తోందని వివరించారు. కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో న్యూఢిల్లీలో జరిగిన 'వికసిత్ భారత్ దిశగా భారతదేశ ప్రయాణానికి ఆర్థిక వనరుల సమీకరణ' సదస్సులో శనివారం డిప్యూటీ సీఎం ప్రసంగించారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఆర్థిక మంత్రులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు, ఆర్థిక నిపుణులు ఈ సదస్సులో పాల్గొన్నారు. తెలంగాణ నుంచి డిప్యూటీ సీఎంతో పాటు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.వికసిత్ భారత్ నిర్మాణాన్ని కేంద్రం లేదా రాష్ట్రాలు విడివిడిగా సాధించలేవని, సహకార సమాఖ్య స్ఫూర్తితో కేంద్రం--రాష్ట్రాలు కలిసి ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు వనరులను సమర్థంగా సమీకరించడంతో పాటు బలమైన సంస్థలు, పరస్పర సహకార విధానాలు అవసరమన్ని తెలిపారు. తెలంగాణ కేవలం నిధులను కోరేందుకు కాకుండా, స్పష్టమైన అభివృద్ధి ప్రణాళిక, ఆర్థిక వనరుల సమీకరణకు నిర్దిష్ట విధానం, దీర్ఘకాలిక లక్ష్యంతో ఈ చర్చలో భాగస్వామ్యమవుతోందని తెలిపారు.

**ప్రయివేటు పెట్టుబడుల సమీకరణకు ప్రాధాన్యం**

3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను నిర్మించాలంటే మౌలిక వసతులకు నిధులు సమకూర్చే విధానంలో మిగతా2లో...

## రష్యాపై కఠిన ఆంక్షల బిల్లుపై ట్రంప్ సంతకం

**- భారత్‌కు 100 శాతం టారిఫ్ ముప్పు..!**



**వాషింగ్టన్ సెప్టెంబర్ 19(పిసిడబ్ల్యూ న్యూస్):** రష్యా నుంచి చమురు, గ్యాస్ దిగుమతి చేసుకునే దేశాలపై అత్యధికంగా 100 శాతం వరకు సుంకాలు విధించే నూతన ఆంక్షల బిల్లుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారికంగా సంతకం చేశారు. మిగతా2లో...

## మరిన్ని రంగుల్లో యూనిఫామ్స్ ఇవ్వండి

- వచ్చే ఏడాది కోసం ఇప్పటి నుంచే ప్రణాళిక చేయాలి
- విద్యార్థులకు నాణ్యమైన సామాగ్రి ఇవ్వాలి
- సమీక్షా సమావేశంలో సీఎం ఏ రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్,సెప్టెంబర్ 19(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందించే యూనిఫాం మరింత ఆకర్షణీయమైన రంగుల్లో ఉండాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి సూచించారు. డిజైన్లలో వైవిధ్యానికి ప్రయత్నించాలని చెప్పారు. శనివారం నాడాయన విద్యార్థులకు అందించే యూనిఫాం, ఇతర సామగ్రి పంపిణీపై సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పీ సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులుతోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు సబ్యసాచి ఘోష్, బాల మాయాదేవి, అహ్మద్ నదీమ్, దివ్య దేవరాజన్, నవీన్ నికోలస్, శ్రుతి ఓజా, మిగతా2లో...



## వరంగల్ విమానాశ్రయానికి పేరును సూచించండి :సీఎం

**హైదరాబాద్,సెప్టెంబర్ 19(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజలు సుదీర్ఘకాలంగా ఎదురు చూసిన కల సాకారం కాబోతుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ప్రపంచస్థాయి ప్రమా ణాలతో కూడిన వరంగల్ ఎయిర్ పోర్టులో విమానాలు ఎగరబోతున్నాయని తెలిపారు. పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ దీర్ఘకాలంగా పెండింగ్ కలను నెరవేర్చలేదని తెలిపారు. దానికి బదులుగా ఆ పార్టీ నాయకులు విలాసవంతమైన ఫాంహౌస్‌లు, మిగతా2లో...

## హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు శ్రీరామరక్ష

- ఫిరాయింపులను ప్రోత్సహించిన బీఆర్ఎస్ కు చెంపపెట్టు
- ఎప్పుడు ఉప ఎన్నిక వచ్చినా కాంగ్రెస్ సిద్ధం
- కేసీఆర్ ఫాంహౌజ్ పై ప్రజలకు నిజాలు తెలియాలి
- బీజేపీది పార్టీలను చీల్చేతత్వం
- మోదీ, అమిత్‌షా ప్రజాస్వామ్యాన్ని నాశనం చేశారు : పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్







## తెలంగాణలో మరో 5 రోజుల వరకు భారీ వర్షాలు..

- బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా పెరగనున్న వానలు
- ములుగు, ఖమ్మం సహా పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ
- రాష్ట్రంలో ఇప్పటివరకు 19 శాతం లోటు వర్షపాతం నమోదు
- అప్రమత్తంగా ఉండాలన్న అధికారులు

## ఎల్‌నినో రాష్ట్రంలోనే ఉందా! ఆంధ్రా, కర్నాటకలో లేదా.?

- ప్రకృతిది కాదు..కాంగ్రెస్ తెచ్చిన కరువు
- రేవంత్ రెడ్డిది అసమర్థ పాలన..ఎకరం ఎండినా సీఎందే బాధ్యత
- పార్టీ ఫిరాయింపులో హైకోర్టు తీర్పు చెంపపెట్టు : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- వనపర్తి జిల్లాలో జూరాల కాలువ, సబ్ స్టేషన్ల పరిశీలన



# యూపీఐపై చార్జీల కత్తి

(మొదటి పేజీ తరువాయి)

అన్నదే ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది. కేంద్రం తాజా నిర్ణయంపై ఆర్థిక నిపుణులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. **'నాలుగు శాతమే' అంటూ ప్రభావాన్ని తగ్గించి చూపే ప్రయత్నం** రూ.2,000లోపు లావాదేవీలు 96 శాతం ఉన్నాయని, కేవలం 4 శాతం వ్యాపారి లావాదేవీలకే ఎండీఆర్ వర్తిస్తుందని ఎన్‌పీసీఐ వివరణ ఇచ్చింది. అయితే లావాదేవీల సంఖ్యను మాత్రమే చూపిస్తూ సమస్యను చిన్నదిగా చూపడం సరైన విధానం కాదని ఆర్థిక నిపుణులు అంటున్నారు. మొత్తం వ్యాపారి లావాదేవీల విలువలో 67 శాతం రూ.2,000కు మించిన లావాదేవీల నుంచే వస్తున్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. వైద్య ఖర్చులు, పాఠశాల ఫీజులు, ఇంటి అద్దెలు, నెలవారీ సరుకులు, మొబైల్ ఫోన్ కొనుగోళ్లు వంటి సాధారణ అవసరాల్లోనూ రూ.2,000కు మించిన చెల్లింపులు ఉంటాయి. అందువల్ల ఎండీఆర్ ప్రభావం కొద్దిమంది సంపన్నులకు మాత్రమే పరిమితమవుతుందని చెప్పడం వాస్తవ పరిస్థితిని పూర్తిగా ప్రతిబింబించదని వారు చెప్తున్నారు. **వ్యాపారుల ఖర్చులు.. ప్రజలపై పరోక్ష భారం** ఎండీఆర్ ఛార్జీలను వినియోగదారులపై మోపకూడదని ప్రభుత్వం చెప్తోంది. అయితే వ్యాపారుల ఖర్చులు పెరిగినప్పుడు వాటిని ఇతర మార్గాల్లో భర్తీ చేసే అవకాశాన్ని పూర్తిగా కొట్టిపారేయలేం. ఇప్పటికే వివిధ డిజిటల్ సేవల్లో కన్వీనియెన్స్ ఫీజులు, ప్లాట్‌ఫామ్ ఫీజులు, ఇతర రుసుముల పేరుతో వినియోగదారులపై ఖర్చులు పెరుగుతున్నాయి. యూపీఐ లావాదేవీలకు సంబంధించిన ఖర్చులు పరోక్షంగా వినియోగదారులకు చేరకుండా పటిష్ఠమైన నియంత్రణ వ్యవస్థ ఉందా? అన్నదే కీలకంగా మారింది. ప్రజలకు అందుబాటులో ఉన్న డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చే ముందు, దాని ప్రభావాలపై ప్రభుత్వం సమగ్రంగా వివరాలు వెల్లడించాలని మేధావులు సూచిస్తున్నారు.

---

# రష్యాపై కఠిన ఆంక్షల బిల్లుపై ట్రంప్ సంతకం

(మొదటి పేజీ తరువాయి)

ఈ చట్టాన్ని అమలు చేసే విషయంలో ట్రంప్ యంత్రాంగానికి విస్తృతమైన అధికారాలు లభించాయి. దీంతో భారత్, చైనా దేశాలు తీవ్రమైన అమెరికా సుంకాల ముప్పును ఎదుర్కొనే అవకాశం ఉంది. ఈ నూతన చట్టం ప్రకారం.. రష్యా నుంచి అత్యధికంగా ముడిచమురు లేదా గ్యాస్ దిగుమతి చేసుకునే టాప్-5 దేశాల నుంచి అమెరికాలోకి దిగుమతయ్యే వస్తువులపై 30 రోజుల్లోపు 100 శాతం వరకు టారిఫ్‌లు విధించడానికి వీలుంటుంది. అదే విధంగా ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత కొత్తగా రష్యా ఇంధనాన్ని కొనుగోలు చేసే దేశాలు లేదా రష్యా ఆంక్షల నుంచి తప్పించుకోవడానికి సహకరిస్తున్న టాప్-5 దేశాలను కూడా ఈ నిబంధన వర్తింపజేయనున్నారు. భారత్, చైనా దేశాలు రష్యన్ ఆయిల్‌ను కొనుగోలు చేస్తున్న ప్రధాన దేశాల జాబితాలో ఉన్నప్పటికీ ఈ బిల్లులో నిర్దిష్ట దేశాల పేర్లను స్పష్టంగా పేర్కొనలేదు. అలాగే టాప్-5 జాబితాను ఏ ప్రాతిపదికన లెక్కిస్తారనే దానిపై కూడా స్పష్టత లేదు. దీనివల్ల ఏ దేశాలపై సుంకాలు విధించాలనే అంశంపై ట్రంప్ యంత్రాంగానికి పూర్తి విచక్షణాధికారం లభించింది.నవంబర్‌లో మధ్యకాలిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో వినియోగదారులపై భారం పడకుండా, ఇంధన ధరలు పెరగకుండా ట్రంప్ ఈ నిర్ణయం అమలులో కొంత సమయం తీసుకోవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. గత 40 ఏళ్లలో కార్యనిర్వాహక శాఖకు కాంగ్రెస్ కొత్త టారిఫ్ అధికారులను కట్టబెట్టడం ఇదే మొదటిసారని వైట్‌హౌస్ లెజిస్లేటివ్ డైరెక్టర్ జేమ్స్ బ్రైడ్ తెలిపారు. కాగా ఏ దేశాలను లక్ష్యంగా చేసుకుంటారనే దానిపై స్పష్టత లేకపోవడం పట్ల ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. భారత్, బ్రెజిల్, జపాన్, యూరోపియన్ యూనియన్ దేశాల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు నేషనల్ ఫారిన్ ట్రేడ్ కౌన్సిల్ ఉపాధ్యక్షురాలు జెనెట్ చు తెలిపారు. కొత్త టారిఫ్‌లు తమ ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపుతాయని భారత్ ఇప్పటికే హెచ్చరించగా, అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా అమెరికా అనుసరిస్తున్న ఏకపక్ష విధానాలను చైనా తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ బిల్లులోని నిబంధనలు అస్పష్టంగా ఉన్నాయని, అధ్యక్షుడు తన విచక్షణాధికారాన్ని దుర్వినియోగం చేసే అవకాశం ఉందని కొందరు న్యాయ నిపుణులు విమర్శిస్తున్నారు.

---

# వికసిత్ భారత్‌లో తెలంగాణది కీలక పాత్ర

(మొదటి పేజీ తరువాయి)

మార్పు అవసరమని భట్టి విక్రమార్క వివరించారు. రోడ్లు, వంతెనలు, ఇతర మౌలిక వసతుల కోసం ప్రభుత్వ రుణాలపైనే అధికంగా ఆధారపడే పద్ధతి నుంచి క్రమంగా మారాల్సిన అవసరం ఉందన్నారు. ప్రయివేటు పెట్టుబడులు, సంస్థాగత నిధులు, సావరిన్ ఫండ్స్ నుంచి అధిక మొత్తంలో పెట్టుబడులను సమీకరించి, ప్రభుత్వ నిధులను వ్యూహాత్మకంగా వినియోగించే నమూనా వైపు తెలంగాణ అడుగులు వేస్తోందన్నారు. ప్రాజెక్టుల్లో పెట్టుబడిదారుల రిస్క్‌ను తగ్గించడం, వయబిలిటీ గ్యాప్‌లను పూడ్చడం, ప్రయివేట్ పెట్టుబడులకు విశ్వాసం కల్పించడం వంటి అంశాల్లో ప్రభుత్వ నిధులు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఇందుకోసం పబ్లిక్--ప్రయివేట్ భాగస్వామ్యాలు (పీపీపీ), గ్రీన్ బాండ్లు, బ్లెండెడ్ ఫైనాన్స్ వంటి మార్గాలను బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. **క్యూర్-ప్యూర్-రేర్‌తో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి** అభివృద్ధి ఒకే నగరానికి పరిమితం కాకూడదని, అదే సమయంలో గ్రామీణ ప్రాంతాలు వెనుకబడకూడదన్న లక్ష్యంతో తెలంగాణ క్యూర్-ప్యూర్-రేర్ పేరుతో మూడు పరస్పర అనుసంధానిత ఆర్థిక ప్రాంతాలతో ప్రత్యేక అభివృద్ధి నమూనాను రూపొందించిందని డిప్యూటీ సీఎం తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ కేంద్రంగా క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్)ను అత్యున్నత సేవలు, కృత్రిమ మేధ, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, ఫిన్‌టెక్, లైఫ్ సైన్సెస్, నాలెడ్జ్ ఆధారిత పరిశ్రమలకు కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ప్రధాన రవాణా మార్గాల వెంట ప్యూర్ (పెరీ-అర్బన్ రీజియన్)ను పారిశ్రామిక, తయారీ రంగాలకు కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. రేర్ (రూరల్ అగ్రికల్చరల్ అండ్ రీసోర్సెస్ ఎకానమి) ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు తీసుకురానున్నట్లు చెప్పారు. **30 వేల ఎకరాలకు పైగా భారత్ ఫ్యూచర్ సిటీ** దేశంలో భవిష్యత్ నగరాలకు నమూనాగా 30 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. దేశంలో తొలి నెట్-జీరో, ఏఐ ఆధారిత గ్రీన్ మెగాసిటీగా దీన్ని తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయాలు, అంతర్జాతీయ పరిశోధనా కేంద్రాలు, క్లీన్ టెక్నాలజీ పార్కులు, పర్యావరణహిత నివాస ప్రాంతాలు ఇందులో భాగంగా ఉంటాయని వివరించారు. **3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం** తెలంగాణ బలమైన ఆర్థిక పునాదులతో తదుపరి దశ వృద్ధికి సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. 2025-26లో రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) రూ.17.82 లక్షల కోట్లకు చేరిందని, ప్రస్తుత ధరల ప్రకారం 10.7 శాతం వృద్ధి నమోదైందన్నారు. స్థిర ధరల ప్రకారం వాస్తవ జీఎస్‌డీపీ వృద్ధి 8.5 శాతంగా అంచనా వేస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, ఇది జాతీయ సగటు రూ.2,19,575తో పోలిస్తే దాదాపు రెండింతలని వివరించారు. సేవల రంగం 13.5 శాతం, ద్వితీయ రంగం 9.4 శాతం వృద్ధి సాధించాయని తెలిపారు. ప్రస్తుత వృద్ధి పథంలో కొనసాగితే 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థ 1.21 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా ఉందని, అయితే 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని సంకల్పించామని ప్రకటించారు. తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ వాటాను ప్రస్తుతం ఉన్న దాదాపు 5 శాతం నుంచి 10 శాతానికి పెంచాలన్నది లక్ష్యమని తెలిపారు. **యువతే తెలంగాణకు అతిపెద్ద బలం** 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు మౌలిక వసతులు, పెట్టుబడులతో పాటు మానవ వనరులే అసలైన పునాది అని డిప్యూటీ సీఎం అన్నారు. తెలంగాణ యువతే రాష్ట్రానికి అతిపెద్ద బలమని వివరించారు. ఉన్నత విద్యకు, పరిశ్రమల అవసరాలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు ప్రముఖ అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యంతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆర్థిక వృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికీ చేరాలని, సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యం రాష్ట్రానికే పరిమితమైనది కాదని, 2047 నాటికి సుసంపన్నమైన, స్వావలంబనతో కూడిన వికసిత్ భారత్ నిర్మాణానికి తెలంగాణ అందించే భాగస్వామ్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వివరించారు.

---

# హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు శ్రీరామరక్ష



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19(పిసిడబ్ల్యూ న్యూస్):**పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ పార్టీకి శ్రీరామరక్ష అని పీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. రాష్ట్రంలో ఈ ఫిరాయింపుల కల్చర్ ను తెచ్చిన కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీలకు ఇది చెంపపెట్టు అని విమర్శించారు. మూడు రోజులుగా ఢిల్లీలో ఉన్న మహేశ్ కుమార్ గౌడ్... శనివారం తెలంగాణ భవన్ లోని శబరీ బ్లాక్ లో మీడియాతో చిట్‌చాట్ చేశారు. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.2014, 2018లో బీఆర్ఎస్ ప్రభుత్వమే పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందని గుర్తు చేశారు. టీడీపీలో గెలిచిన తలసాని, కాంగ్రెస్ నుంచి గెలిచిన సబిత, ఇతర పార్టీల నుంచి గెలిచిన ఎమ్మెల్యేలకు నేరుగా మంత్రి పదవులు ఇచ్చిన చరిత్ర బీఆర్ఎస్ ది అని మండిపడ్డారు. అలాగే కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లోకి తీసుకుని ప్రతిపక్షానికి శాసనసభలో సరైన హోదా లేకుండా చేశారన్నారు. ఇప్పుడు పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నేతలు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పార్టీ ఫిరాయింపుల విషయంలోనూ అప్పటి ప్రభుత్వం అనుసరించిన విధానాలను రాష్ట్ర ప్రజలు మర్చిపోలేదన్నారు.**ప్రభుత్వాన్ని కూల్చుతామన్నారు...** పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే ముందు తమ ప్రభుత్వ హయాంలో జరిగిన పరిణామాలను గుర్తు చేసుకోవాలని బీఆర్ఎస్ నేతలకు పీసీసీ చీఫ్ హితవు పలికారు. ప్రధానంగా ఆనాటి సీఎం కేసీఆర్ అనేక నిబంధనలు ఉల్లంఘించి, ఫిరాయింపులను ప్రోత్సహించారని మండిపడ్డారు.**బీజేపిది పార్టీలను చీల్చే సంస్కృతి...** దేశవ్యాప్తంగా పార్టీ ఫిరాయింపులను బీజేపీ కూడా ప్రోత్సహించిందని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. ఫిరాయింపులతో ఆగకుండా... పార్టీలను చీల్చి లబ్ధి పొందే సంస్కృతికి తెరలేపిందని తీవ్రంగా మండిపడ్డారు. టీ-ఎంసీ, శివసేన, ఎన్‌సీపీ వంటి పార్టీలను చీల్చి పలు రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీశారని ఆరోపించారు. పార్టీ ఫిరాయింపులపై దేశవ్యాప్తంగా ఒకే విధమైన రాజకీయ ప్రమాణాలు ఉండాలని అన్నారు. కాగా... ఎవరికి మంత్రి పదవులు ఇవ్వాలి, ఎప్పుడు ఇవ్వాలనే నిర్ణయం పూర్తిగా సీఎం రేవంత్‌రెడ్డిదేనన్నారు. పార్టీ, ప్రభుత్వానికి సంబంధించిన అంశాల్లో అధిష్టానం, ముఖ్యమంత్రి నిర్ణయాలకు అనుగుణంగానే ముందుకు సాగుతామని ఆయన స్పష్టం చేశారు.

---

## వరంగల్ విమానాశ్రయానికి పేరును సూచించండి :సీఎం

(మొదటి పేజీ తరువాయి)

వారి కుటుంబ ఇష్టాలను తీర్చుకోవడంలోనే శ్రద్ధ చూపించారని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో కల నిజం కాబోతుందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం మామునూరు ఎయిర్ పోర్ట్ భూసే కరణ కోసం రూ.295 కోట్లు కేటాయించిందని గుర్తుచేశారు. అవసరమైన భూమిని పూర్తిగా సేకరించి ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగించినట్టు తెలిపారు.అది ఒక విమానా శ్రయం మాత్రమే కాదనీ, పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉద్యోగాలు, పెట్టుబడులకు ప్రవేశ ద్వారమని ముఖ్యమంత్రి అభివర్ణించారు. మామునూరు ఎయిర్ పోర్ట్ నుంచి విమానాలు గాలిలో ఎగరడం అంటే అది అభివృద్ధి చెందుతున్న, అనుసంధానమవుతున్న తెలంగాణకు సంకేతమని తెలిపారు. వరంగల్ లో రాబోయే నూతన విమానాశ్రయానికి పేరు పెట్టేందుకు సూచనలు ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు.

## మరిన్ని రంగుల్లో యూనిఫామ్స్ ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

సైదులు, సంతోష్, సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్స్ స్కూల్స్ పిల్లలకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన వస్తువుల పంపిణీ వివరాలను అధికారులు సీఎంకు నివేదించారు. విద్యార్థులకు ఒక జత యూనిఫాం పంపిణీ పూర్తయిందనీ, రెండో జత యూనిఫాంను నెలాఖరులోగా అందజేస్తామని తెలిపారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు అందజేశామన్నారు. విద్యార్థులందరికీ నోటు పుస్తకాలు పంపిణీ పూర్తయిందని చెప్పారు. ప్రభుత్వ వసతిగృహాలు, రెసిడెన్షియల్స్ స్కూల్స్, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలోని విద్యార్థులందరికీ ప్లేట్లు, గ్లాసులు, కటోరాలు, స్పూన్లు, కప్పులు, కార్పెట్లు, బెడ్ షీట్లు, టవళ్లు పంపిణీ పూర్తయిందని అధికారులు సీఎంకు వివరించారు. ఆయా వివరాల పట్ల ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తంచేశారు. వచ్చే ఏడాది పాఠశాలలు తెరిచిన రోజే యూనిఫాం, ఇతర సామగ్రి విద్యార్థులకు అందేలా ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. వచ్చే ఏడాది ప్రస్తుతం ఉన్న విద్యార్థులకు అదనంగా 10 శాతం విద్యార్థులు పాఠశాలల్లో చేరే అవకాశం ఉన్నందున, అందుకు తగినట్లు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు వచ్చిన తక్షణం ముఖ్యమంత్రి కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ ఏడాది అనుకున్న లక్ష్యాల ప్రకారం పనిచేసిన అధికారుల్ని అభినందించారు.

## ఎల్‌నినో రాష్ట్రంలోనే ఉందా!... ఆంధ్రా, కర్నాటకలో లేదా.?

**పెబ్బేరు,సెప్టెంబర్ 19(పిసిడబ్ల్యూ న్యూస్):** 'ఎల్‌నినో ప్రభావం తెలంగాణ రాష్ట్రంలోనే ఉందా! ఆంధ్రా, కర్నాటక రాష్ట్రాలలో లేదా.? రైతులకు నీళ్లు ఇవ్వలేని రేవంత్ రెడ్డిది.. అసమర్థ పాలన. ఎకరం పొలం ఎండినా సీఎందే బాధ్యత. ఇది ప్రకృతి తెచ్చినది కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారకరామారావు అన్నారు. శనివారం కొల్లాపూర్ పర్యటనలో భాగంగా వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలో పర్యటించిన కేటీఆర్ జూరాల కాల్వలల్లోని నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మెన్ కరుణశ్రీ సాయి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డితో కలిసి మాట్లాడారు. ఎల్ నినో పేరుతో ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని, పంటలకు సాగునీరు ఇవ్వకపోవడమే కాకుండా విద్యుత్ కోతలతోనూ పంటలు ఎండిపోతున్నాయన్నారు. జూరాల డ్యామ్ లో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ, ఆంధ్రప్రదేశ్ కు ఎగువ ఉన్న పోతిరెడ్డిపాడు వెలిగొండ ప్రాజెక్టులకు 100 టీఎంసీల నీరు విడుదల చేయడం సిగ్గుచేటు అని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం మాత్రం సాగుకు కృష్ణా జలాలను పాలమూరు రైతులకు ఇవ్వలేకపోతుందన్నారు. కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉందని, అక్కడి ప్రభుత్వంతో మాట్లాడి నీటిని జూరాలకు తరలించవచ్చు కదా అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఆల్మట్టి నారాయణపూర్ ప్రాజెక్టుల వద్ద ఐదు మీటర్ల ఎత్తు పెంచడానికి కర్నాటక ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేసిందన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల అనేక రిజర్వాయర్లకు సాగునీరు అందించేందుకు కాళేశ్వరం ప్రాజెక్టును రూ.84 వేల కోట్లతో 40 టీఎంసీల నీటి కోసం కేసీఆర్ నిర్మిస్తే దానికి రేవంత్‌రెడ్డి కాకిగోల చేస్తున్నారని విమర్శించారు.కింద ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సాగునీరు పోతుంది, కానీ పైన ఉన్న తెలంగాణకు నీళ్లు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఇది కేవలం గురువు మీద ఉన్న ప్రేమతోనే రేవంత్ రెడ్డి ప్రశ్నించడం లేదని విమర్శించారు. అత్యల్పంగా కృష్ణా నీటిని వినియోగించుకున్న ప్రభుత్వం రేవంత్ రెడ్డిదే అని అన్నారు. కల్వకుర్తి లిఫ్టులను కొనసాగించకుండా రైతులకు సాగునీరు అందించకుండా ప్రభుత్వమే ఇబ్బందులు పెడుతుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రైతులకు 24 గంటలు కరెంటు సరఫరా చేస్తే రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేవలం 6 గంటలు కూడా సరఫరా చేయడం లేదన్నారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుపై ప్రభుత్వానికి హైకోర్టు తీర్పు చెంపపెట్టు అన్నారు. తొలి వికెట్ దానం నాగేందర్ అని, మిగతా వారిని కూడా తొందర్లోనే పడగొడతామన్నారు. పార్టీ ఫిరాయించిన వారందరూ రాజీనామా చేసి గెలవాలన్నారు. మళ్లీ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం వస్తుందని, ప్రజల కష్టాలన్నీ తీరుస్తుందని తెలిపారు. సమావేశంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, ఉమ్మడి పాలమూరు జిల్లా మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా బీఆర్ఎస్ నాయకులు గట్టు యాదవ్, పెబ్బేరు మండల పట్టణ పార్టీ అధ్యక్షులు వనం రాములు, దిలీప్ కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు కరుణశ్రీ, హరి శంకర్ నాయుడు, సౌజన్య, మన్యం, పార్టీ నాయకులు కర్రే స్వామి, పెద్దింటి వెంకటేష్, సాయి, విశ్వరూపం తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో మరో 5 రోజుల వరకు భారీ వర్షాలు..



**హైదరాబాద్: సెప్టెంబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్):**వర్షాల కోసం ఎదురుచూస్తున్న రాష్ట్ర ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) చల్లటి కబురు అందించింది. రాష్ట్రంలోఈ నెల 24 వరకు పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఐఎండీ హైదరాబాద్ కేంద్రం తెలిపింది. ఇది క్రమంగా బలపడి దక్షిణ ఒడిశా- ఉత్తర ఆంధ్ర తీరాల వైపు కదులుతుందని, దీని ప్రభావంతో తెలంగాణలో వర్షాలు పుంజుకుంటాయని అంచనా వేసింది. ఈ వానాకాలంలో ఇప్పటివరకు రాష్ట్రంలో సాధారణం కన్నా 19 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఈ కొత్త అల్పపీడనంతో ఆ లోటు కొంతవరకు భర్తీ అయ్యే అవకాశం కనిపిస్తోంది. ఆదివారం, సోమవారం ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, సిద్దిపేట, మెదక్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. తర్వాతి రోజుల్లో ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్ సహా మరిన్ని జిల్లాలకు ఈ హెచ్చరికలు వర్తించనున్నాయి. హైదరాబాద్ నగరంలోనూ ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. రుతుపవనాల తిరోగమనం ఆలస్యమయ్యే సూచనలు ఉన్నాయని, అక్టోబర్ రెండో వారం వరకు వర్షాలు కొనసాగవచ్చని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# శ్రీనగర్‌లో ఘనంగా పోషణ్ మాసం కార్యక్రమం

**పోషకాహార లోప నివారణకు అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి**

**చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి**

**పోషకాహారంపై తల్లులకు అవగాహన కల్పించిన అధికారులు**

**చిన్న పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమంలో పాల్గొన్నా సర్పంచ్ మల్లేశం**





**జేడీ మల్లంపల్లి, సెప్టెంబర్ 19(పిసిడబ్ల్యూ న్యూస్):** పోషణ్ మాసం సందర్భంగా శనివారం శ్రీనగర్ గ్రామపంచాయతీ అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత,సీడీపీఓ శిరీష,సూపర్‌వైజర్ కమరున్నీసా,సర్పంచ్ ఆకుల మల్లేష్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మల్లేష్ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలు,పౌష్టికాహారం ఎంతో ముఖ్యమని అన్నారు.తల్లిదండ్రులు చిన్నారులకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడంతోపాటు వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత మాట్లాడుతూ చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిల్లల తల్లులకు సూచించారు.అనంతరం చిన్న పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం స్వాతి, అంగన్వాడీ టీచర్ ఉమారాణి, ఆశా వర్కర్ జ్యోతి, ఉపసర్పంచ్ అరుణ, వార్డు సభ్యురాలు సంధ్య, చిన్నారులు, వారి తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# పైడాకుల అశోక్ అన్న పుట్టినరోజు వేడుకలు



**మల్లంపల్లి మండల ప్రతినిధి సెప్టెంబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు డీసీసీ అధ్యక్షులు పైడాకుల అశోక్ గారి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన మల్లంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ బృందం…ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ గారి జన్మదిన వేడుకలను మల్లంపల్లి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మూల గణేష్ రెడ్డి గారి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అశోక్ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.గ్రామస్థాయి కాంగ్రెస్ కార్యకర్తగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎదిగిన పైడాకుల అశోక్ గారు పార్టీ బలోపేతానికి, కార్యకర్తల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నారని నాయకులు అన్నారు. మంత్రి సీతక్క గారి నాయకత్వంలో పార్టీ కోసం అహర్నిశలు పనిచేస్తూ, యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని కొనియాడారు.ఈ సందర్భంగా పైడాకుల అశోక్ గారికి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో నిండిన దీర్ఘాయుష్షు కలగాలని మల్లంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మల్లంపల్లి మండల పార్టీ అధ్యక్షులు చెరుకుపల్లి శ్రీకాంత్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు పొనుగంటి రవీందర్, మలుగు జిల్లా మెడికల్ హెల్త్వింగు చైర్మన్ ఆనందపు రవి బాబు, మల్లంపల్లి ఉపసర్పంచ్  అంకం సురేష్, వార్డు సభ్యులు జింక వేణు, దయ్యాల చంద్రమౌళి, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు గొర్రె కుమార్ స్వామి, చందా రాము, కొలిపాక శ్రీను, క్లాసిక్ రవి  మరియు స్థానిక మహిళా నాయకురాళ్లు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# సామాజిక చైతన్యానికి రావుగారి రచనలు అక్షర ఆయుధాలు

**టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఖదీర్**

**జర్నలిస్టుల హక్కుల సాధన పోరాటంలో ఆయన కలం అవసరం**

**సమాజాన్ని మేల్కొలిపే రచయిత మంత్రిప్రగడ శ్రీనివాసరావు**







**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సీనియర్ జర్నలిస్టు, కవి, రచయిత మంత్రిప్రగడ శ్రీనివాసరావు(రావుగారి) రచనలు సామాజిక సమస్యలను ప్రతిబింబిస్తూ ప్రజల్లో ఆలోచనను రేకెత్తిస్తున్నాయని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఖదీర్ అన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు దువ్వా సాగర్ అధ్యక్షతన శనివారం ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ, ప్రెస్ క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో మంత్రిప్రగడ శ్రీనివాసరావును శాలువాతో సన్మానించి మెమొంటో అందజేసి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా సయ్యద్ ఖదీర్ మాట్లాడుతూ… తెలుగు భాషపై మక్కువ, సామాజిక అంశాలపై అవగాహన, నిరంతర కృషి శ్రీనివాసరావు రచనలకు ప్రత్యేకతను తీసుకొచ్చాయని అన్నారు. నమస్తే తెలంగాణ దినపత్రికలో ఆయన రాసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కథనాలు ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాయని గుర్తుచేశారు. అమెరికాలోనూ తెలుగు భాష, సంస్కృతి విశిష్టతను చాటిన శ్రీనివాసరావు ఖమ్మం జిల్లాకు చెందినవారు కావడం గర్వకారణమన్నారు. జర్నలిస్టుల హక్కులు, ఇళ్ల స్థలాల సమస్యలపై ఆయన అనుభవం, రచనా ప్రతిభ ఫెడరేషన్‌కు ఎంతో ఉపయోగపడాలని ఆకాంక్షించారు.జిల్లా ఉపాధ్యక్షుడు దువ్వా సాగర్, రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యులు సంతోష్ చక్రవర్తి మాట్లాడుతూ… శ్రీనివాసరావు రచనలు, కవితలు యువ జర్నలిస్టులకు స్ఫూర్తినిచ్చేలా ఉన్నాయని అన్నారు. జిల్లా కమిటీ సభ్యుడు షేక్ జానీ పాషా, రాష్ట్ర కమిటీ సభ్యురాలు మధుశ్రీ, జిల్లా కమిటీ సభ్యులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దగ్గుబాటి మాధవరావు, ప్రధాన కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు తదితరులు ఆయన సేవలను కొనియాడారు. ఆయన సాహిత్య, జర్నలిస్టు సేవలను గుర్తించి తగిన గౌరవ పురస్కారానికి 'డాక్టరేట్' కు సిఫార్సు చేసే అంశాన్ని పరిశీలించాలని సంతోష్ చక్రవర్తి సూచించారు.సత్కారానికి స్పందించిన మంత్రిప్రగడ శ్రీనివాసరావు మాట్లాడుతూ… అమెరికాలో అవార్డు పొందడం కంటే ఆత్మీయ జర్నలిస్టుల మధ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ వేదికగా సత్కారం పొందడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. సయ్యద్ ఖదీర్ యువ నాయకత్వాన్ని, దువ్వా సాగర్, జానీ పాషా అందించిన సహకారాన్ని ప్రత్యేకంగా గుర్తుచేశారు. భవిష్యత్తులో జర్నలిస్టుల హక్కులు, ఇళ్ల స్థలాల సమస్యలతో పాటు జర్నలిస్టు సంక్షేమ అంశాలపై తన రచనా శక్తిని వినియోగిస్తానని తెలిపారు. హక్కుల సాధనకోసం అన్ని జర్నలిస్టు సంఘాలు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం మంత్రిప్రగడ శ్రీనివాసరావును శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు యూసుఫ్ పాషా, జర్నలిస్టులు ఎస్వీ రెడ్డి, రోషి రెడ్డి, మురళి, వీడియో జర్నలిస్టు అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు అర్షద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# పెన్షనర్ల సేవకు గౌరవం.. నాంపల్లిలో ఆకట్టుకుంటున్న 'పెన్షనర్ వినాయకుడు'!




**హైదరాబాద్, సెప్టెంబర్ 19(పిసిడబ్ల్యూ న్యూస్):** ఉద్యోగుల జీవితకాల సేవకు గౌరవం, పదవీ విరమణ అనంతరం పెన్షన్ ద్వారా లభించే ఆర్థిక భద్రత, ఆత్మగౌరవంతో కూడిన జీవనానికి ప్రతీకగా హైదరాబాద్‌లో కొలువుదీరిన 'పెన్షనర్ వినాయకుడు' అందరినీ విశేషంగా ఆకట్టుకుంటున్నాడు. నాంపల్లిలోని పెన్షన్ పేమెంట్ ఆఫీస్ (పీపీఓ) ప్రాంగణంలో జాయింట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ఈ వినూత్న వినాయక మండపాన్ని ఏర్పాటు చేశారు. **ఆకట్టుకుంటున్న వినూత్న** థీమ్: సంప్రదాయ భక్తి భావానికి ఆధునిక సామాజిక స్పృహను జోడిస్తూ నిర్వాహకులు ఈ థీమ్‌ను తీర్చిదిద్దారు. 'సేవ  పదవీ విరమణ  పెన్షన్  భద్రత  గౌరవప్రదమైన జీవితం' అనే అర్థవంతమైన నినాదాన్ని ప్రతిబింబించేలా ఈ మండప అలంకరణ సాగింది. జీవితాంతం ప్రజా సేవలో తరించి పదవీ విరమణ పొందిన పెన్షనర్ల శ్రమను, వారి ఆత్మగౌరవాన్ని గౌరవిస్తూ నివాళిగా ఈ విగ్రహాన్ని, సెట్టింగ్‌ను రూపొందించారు.విఘ్నాలను తొలగించే గణనాథుడు ప్రతి పెన్షనర్‌కు ఆయురారోగ్యాలు, మానసిక ప్రశాంతత, ఆర్థిక సుస్థిరత ప్రసాదించాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. ప్రభుత్వ ఉద్యోగులకే కాక, సామాన్య భక్తులకు సైతం విశేషంగా నచ్చిన ఈ 'పెన్షనర్ వినాయకుడి'ని దర్శించుకునేందుకు నగరవాసులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.

# 22-ఏ నిషేధిత జాబితాతో భూ యజమానులకు ఇబ్బందులు

**- బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ద్రోణచారి**



**మల్లంపల్లి,: సెప్టెంబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో భూమి 22-ఏ నిషేధిత జాబితాలో చేరితే అమ్మకం, బదిలీ, రిజిస్ట్రేషన్ వంటి లావాదేవీలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ద్రోణచారి తెలిపారు. అయితే 22-ఏలో భూమి ఉండటం అంటే ప్రతి సందర్భంలో అది ప్రభుత్వ భూమి అని అర్థం కాదన్నారు.భూమి ఏ కారణంతో నిషేధిత జాబితాలోకి చేరిందో ముందుగా తెలుసుకోవాలని సూచించారు.భూ భారతి రికార్డుల్లో సర్వే నంబర్‌ను పరిశీలించి,పట్టాదారు పాస్‌బుక్,హక్కు పత్రాలు, పాత రిజిస్ట్రేషన్ పత్రాలు, రెవెన్యూ, మ్యుటేషన్ రికార్డులు తదితర ఆధారాలను సిద్ధం చేసుకోవాలన్నారు.భూమి పొరపాటున 22-ఏ జాబితాలో చేర్చినట్లు భావిస్తే భూ భారతి ద్వారా సంబంధిత ఫిర్యాదు దాఖలు చేసి,అవసరమైన పత్రాలను సమర్పించవచ్చన్నారు.అధికారుల పరిశీలన అనంతరం నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.22-ఏ నుంచి భూమి తొలగింపు స్వయంచాలకంగా జరగదని,భూమి జాబితాలోకి చేరిన కారణాన్ని బట్టి ప్రక్రియ మారుతుందని ద్రోణచారి తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**ఖమ్మం జిల్లా అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బిందు ప్రియ**

**న్యూ లక్ష్మీపురం కేజీబీవీలో ఘనంగా 'స్వచ్ఛత హీ సేవ'**

**మొక్కలు నాటిన అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బిందు ప్రియ**



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఖమ్మం జిల్లా అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బిందు ప్రియ అన్నారు.'స్వచ్ఛత హీ సేవ' కార్యక్రమంలో భాగంగా ఖమ్మం జిల్లా, ముదిగొండ మండలం, న్యూ లక్ష్మీపురం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఖమ్మం జిల్లా అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బిందు ప్రియ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ (డీఎల్ఎస్ఏ) ఆధ్వర్యంలో విద్యార్థినులకు న్యాయ విజ్ఞాన సదస్సు (లీగల్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్) నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి బిందు ప్రియ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, ప్రతి విద్యార్థి మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. చట్టాలపై ప్రాథమిక అవగాహన కలిగి ఉండటం వల్ల సమాజంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవచ్చని, లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా సామాన్యులకు లభించే ఉచిత న్యాయ సేవలను గురించి వివరించారు. అనంతరం ఆమె పాఠశాలలోని స్టోర్ రూమ్‌ను, భోజన శాలను, నిల్వ ఉంచిన నిత్యావసర సరుకుల నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సీఐ మురళి విద్యార్థినులకు మాదకద్రవ్యాల నివారణ (యాంటీ డ్రగ్స్), సైబర్ సెక్యూరిటీ, బాలల హక్కులు (చైల్డ్ రైట్స్) తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సోషల్ మీడియా వినియోగంలో ఎదురయ్యే సైబర్ మోసాలు, ప్రమాదాలపై అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. ఏదైనా ఆపద లేదా సమస్య ఎదురైతే పోలీసుల దృష్టికి తీసుకురావాలని లేదా సంబంధిత హెల్ప్‌లైన్‌లను ఆశ్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవి కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కళ్యాణి, మండల విద్యాశాఖ అధికారి రమణయ్య, కస్తూరిబా ప్రత్యేక అధికారి (ఎస్ఓ) బండారు ఇందిర, ఇంచార్జి ఎంపీఓ రామకృష్ణ, ఏపీఓ రమాదేవి, స్థానిక సర్పంచ్ సలీమా ఖాసీం బాబు, ఉప సర్పంచ్ రమాదేవి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ వెంకటలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్ స్వరూపతో పాటు పాఠశాల పిఈటీ పిల్లలమర్రి సునీత  ఉపాధ్యాయులు సుకన్య, స్వాతి, నాగమణి, జ్యోతి, రాధ, ఉమాదేవి, యాస్మిన్, రజిని, సుజాత, సుమలత, సుహాసిని, ఎఎన్ఎమ్‌రేణుక, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# మల్లంపల్లిలో పైడాకుల అశోక్ జన్మదిన వేడుకలు

**- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు**



**జేడీ మల్లంపల్లి సెప్టెంబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ జన్మదిన వేడుకలను మల్లంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు.కాంగ్రెస్ నాయకులు మూల గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అశోక్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామస్థాయి కార్యకర్తగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎదిగిన పైడాకుల అశోక్ పార్టీ బలోపేతానికి,కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.మంత్రి సీతక్క నాయకత్వంలో పార్టీ కోసం పనిచేస్తూ యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు.అశోక్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో దీర్ఘకాలం ప్రజాసేవ చేయాలని నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షించారు.కార్యక్రమంలో మల్లంపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు చెరుకుపల్లి శ్రీకాంత్ రెడ్డి,గ్రామ పార్టీ అధ్యక్షులు పొనుగంటి రవీందర్,జిల్లా మెడికల్ హెల్త్ వింగ్ చైర్మన్ ఆనందపు రవిబాబు,ఉపసర్పంచ్ అంకం సురేష్,వార్డు సభ్యులు జింక వేణు,దయ్యాల చంద్రమౌళి,నాయకులు గొర్రె కుమార్ స్వామి,చందా రాము,కొలిపాక శ్రీను,క్లాసిక్ రవి, మహిళా నాయకురాళ్లు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# గురుకుల విద్యాలయాల్లో నాసిరకం సరుకుల పంపిణీ

**పేద బిడ్డల కడుపు కొడుతున్న**

**'నేకాఫ్' కాంట్రాక్ట్ దందా**

**రూ. 900 కోట్ల గురుకుల విద్యాలయాల అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి**

**అమ్మలా ఆదరించాల్సిన ప్రభుత్వమే నాసిరకం కూటితో విషం చిమ్ముతోంది**

**తెలంగాణ బిసి, ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్ట్ జేపీసీ జిల్లా కన్వీనర్ ఉదయ్ స్వేరో వారియర్ ఆగ్రహం**

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో చదువుకుంటున్న రెక్కాడితే గానీ డొక్కాడని పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల పిల్లల భవిష్యత్తుతో ప్రభుత్వం రాక్షసంగా ఆడుకుంటోందని తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్ట్ జేపీసీ జిల్లా కన్వీనర్ ఉదయ్ స్వేరో వారియర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గురుకుల విద్యార్థుల తల్లిదండ్రుల సంఘం, స్వేరోస్ నెట్‌వర్క్, భీమ్ వారియర్స్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు తమ బిడ్డలు బాగా చదువుకొని, పౌష్టికాహారం తిని ప్రయోజకులు అవుతారన్న నమ్మకంతో గురుకులాలకు పంపితే, ప్రభుత్వం మాత్రం కాసుల కక్కుర్తి కోసం కల్తీ సరుకులు పంపిణీ చేస్తూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బ్లాక్ లిస్ట్‌లో ఉన్న 'నేకాఫ్' అనే సంస్థకు నిబంధనలకు విరుద్ధంగా రూ. 900 కోట్ల నిత్యవసర సరుకుల కాంట్రాక్టును కట్టబెట్టడం వెనుక భారీ కుంభకోణం దాగి ఉందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే ఈ జీవో నెం. 17ను రద్దు చేసి, ఈ దందాలపై 'సిట్' ఏర్పాటుచేసి, హైకోర్టు సిట్టింగ్ జడ్జితో పూర్తి స్థాయి విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. **కల్తీ ఆహారంతో క్యాన్సర్ ముప్పు : జీవో 17తో వికేంద్రీకరణకు ముగింపు** విద్యార్థులకు అందించే ఆహారంలో బ్రాండ్ లేని నాసిరకం గోధుమపిండి, గంటసేపైనా ఉడకని ఆఫ్రికన్ పప్పులు, కల్తీ నూనెలు సరఫరా చేస్తున్నారని నాయకులు మండిపడ్డారు. మార్కెట్‌లో కేజీ రూ. 50 ఉండే గోధుమపిండిని రూ. 66కి, రూ. 40 ఉండే చక్కెరను రూ. 60కి, రూ. 221 ఉండే ఎండుమిర్చిని రూ. 350 చొప్పున అధిక ధరలకు చూపిస్తూ కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ నాసిరకం, కల్తీ ఆహారం తినడం వల్ల విద్యార్థులు పౌష్టికాహార లోపంతో పాటు మానసిక ఆందోళనలు, శరీర ధృఢత్వం కోల్పోవడం, చివరికి క్యాన్సర్ వంటి




ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సంక్షేమ అధికారులు, ప్రిన్సిపాళ్లు, విద్యార్థులు, తల్లిదండ్రులతో కూడిన కమిటీల ద్వారా నాణ్యమైన సరుకులు వచ్చాయో లేదో పరిశీలన చేసేవారని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ కమిటీలను రద్దు చేసి సెంట్రలైజ్డ్ టెండర్ల పేరిట చిరు వ్యాపారుల పొట్ట కొడుతోందని విమర్శించారు. అధిక ధరల వల్ల విద్యార్థులకు వారానికి ఐదు రోజులు ఇవ్వాల్సిన గుడ్లను రెండు, మూడు రోజులకు కుదించి, అవి కూడా నాసిరకం (తక్కువ గ్రేడ్) గుడ్లను అందిస్తున్నారని ఆవేదన చెందారు. **అదృశ్య శక్తుల చేతిలో 'నేకాఫ్'.. రద్దు చేయకపోతే ప్రజాక్షేత్రంలో ఉద్యమం ఖాయం** గతంలో ప్రభుత్వ మార్క్‌ఫెడ్ డిపార్ట్‌మెంట్ చేత బ్లాక్ లిస్ట్‌లో పెట్టబడిన 'నేకాఫ్' సంస్థకు ఏ ప్రాతిపదికన మళ్లీ టెండర్లు ఇచ్చారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని నాయకులు నిలదీశారు. అసలు నేకాఫ్ వెబ్‌సైట్‌లో బాధ్యుల పేర్లు ఉండవని, దానికి ఎండీ ఎవరో, అసలు కార్యాలయం ఎక్కడ ఉందో ఎవరికీ తెలియదని తెలిపారు. శ్రీనివాసరావు, మస్తాన్ రావు అనే వ్యక్తులు తెరవెనుక ఉండి ముడుపులు అప్పగించే పనిలో పడ్డారని, అధికారుల సమక్షంలోనే ఈ దోపిడీ జరుగుతోందని వారు ఆరోపించారు. తక్షణమే నాసిరకం సరుకుల కాంట్రాక్టును వెనక్కి తీసుకోకపోతే రాబోయే రోజుల్లో ఖమ్మం జిల్లా వేదికగా విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉపాధ్యాయ, ప్రజా సంఘాల మద్దతుతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జేఏసీ కో-కన్వీనర్ కంకణాల శ్రీనాథ్, స్వేరోస్ సీనియర్ నాయకులు దామెర్ల పృథ్వి రాజ్, బక్క వెంకటేశ్వర్లు, తల్లిదండ్రుల సంఘం జిల్లా అధ్యక్షుడు నారపోగు నాగయ్య, కోండ్రు రామచంద్రు, సోలెపోగు శ్యాంసుందర్, హాస్టల్స్ నాయకులు సాయి, ప్రేమ్ కుమార్, బహుజన నాయకుడు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## 4వ వార్డులో ఘనంగా గణేష్ నిమజ్జనం



**సత్తుపల్లి, సెప్టెంబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో జై గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నిమజ్జన కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ పాల్గొన్నారు. వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేకల నరసింహారావు, క్లబ్బు వెంకన్న, షేక్ బాబు, మేడే శీను, దావూద్ షేక్, చాంద్ పాషా, అద్దంకి అనిల్, గంధ్ర రఘు, జొన్నల గడ్డ కృష్ణ, తడికమళ్ల సాల్మన్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా అమన్ జిత్ సింగ్ నియామకం

**సిక్కు మైనార్టీకి పెద్దపీట - కాంగ్రెస్ నిర్ణయం పట్ల సిక్కు సమాజంలో హర్షం**

**రేకుర్తి క్యాంపు కార్యాలయంలో నియామక పత్రం అందజేసిన డిసిసి అధ్యక్షులు మేడిపల్లి సత్యం**

**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 19(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పట్టణంలోని సిక్కు వాడికి చెందిన కాంగ్రెస్ నాయకులు అమన్ జిత్ సింగ్ ను జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం నగరంలోని రేకుర్తి క్యాంపు కార్యాలయంలో నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం మాట్లాడుతూ - కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ సామాజిక న్యాయానికి, అన్ని మతాలకు, అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యత ఇస్తుందని, అందులో భాగంగానే సిక్కు మైనార్టీకి చెందిన అమన్ జిత్ సింగ్ కు ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించడం జరిగిందన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ




బలోపేతానికి, సిక్కు మైనార్టీల హక్కులపై పోరాటం, వారి సమస్యల పరిష్కారం కోసం అమన్ జిత్ సింగ్ వారధిగా పని చేస్తారని ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సిక్కు మైనార్టీ ప్రజలతో పాటు అన్ని వర్గాలకు విస్తృతంగా తీసుకెళ్లాలని ఆదేశించారు. తన నియామకం పట్ల అమన్ జిత్ సింగ్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన డిసిసి అధ్యక్షులు మేడిపల్లి సత్యంకి, జిల్లా మంత్రులకు, జిల్లా కాంగ్రెస్ ముఖ్య నేతలకు, సీనియర్ నాయకులకు మరియు కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పురుమల్ల శ్రీనివాస్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆదేశాల మేరకు జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తూ, మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. అమన్ జిత్ సింగ్ నియామకం పట్ల కరీంనగర్ సిక్కు సమాజం, మైనార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.



## శాతవాహన అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా డా. ఇ. మనోహర్ బాధ్యతల స్వీకరణ




**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 19(పిసిడబ్ల్యూ న్యూస్):** శాతవాహన విశ్వవిద్యాలయ పి.జి., ప్రొఫెషనల్ కోర్సుల అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా డా. ఇ. మనోహర్ నియామకమయ్యారు. ఉపకులపతి ఆచార్య యు ఉమేష్ కుమార్ విశ్వవిద్యాలయ పరిపాలనా భవనంలో రిజిస్ట్రార్ ఆచార్య సతీష్ కుమార్ సమక్షంలో ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా డా. ఇ. మనోహర్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన విశ్వవిద్యాలయ అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ, విశ్వవిద్యాలయ పరీక్షల విభాగాన్ని మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహిస్తూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆయన పూర్వం విశ్వవిద్యాలయ యు జి సి సెల్ డైరెక్టర్ గా కామర్స్, మేనేజ్మెంట్ కళాశాల ప్రిన్సిపల్ గా, గోదావరిఖని పీజీ కళాశాల ప్రిన్సిపల్ గా పని చేయగా ప్రస్తుతం జాతీయ సేవా పథకం సమన్వయ అధికారిగా పనిచేస్తున్నారు. డా. ఇ. మనోహర్ నియామకం పట్ల విశ్వవిద్యాలయ అధ్యాపకులు, నాన్-టీచింగ్ సిబ్బంది, పరిశోధకులు, విద్యార్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యం

**భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి**

**సబ్ కలెక్టర్ అధికారులకు ఆదేశం**

**వేంసూరు, సెప్టెంబర్ 19 (పిసీడబ్ల్యూ న్యూస్) :** ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులు, అభ్యర్థనలను సత్వరమే పరిష్కరించాలని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సేవలకు సంబంధించిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. వేంసూరు మండలంలో శనివారం ప్రజావాణి పిటిషన్లు, మీ సేవ దరఖాస్తులు, భూ భారతి ఫైళ్ల ప్రాసెసింగ్, భూ సమస్యలు, వివాదాలపై సంబంధిత అధికారులతో సబ్



కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి పిటిషన్లు, మీ సేవ దరఖాస్తుల పరిష్కార స్థితిగతులను పరిశీలించారు. భూ భారతి కింద అందిన దరఖాస్తులు, భూ రికార్డులు, భూ వివాదాలు, సరిహద్దు సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత రికార్డులను సరిచూసిన అనంతరం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పెండింగ్ దరఖాస్తులను ప్రాధాన్యతా క్రమంలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు రెవెన్యూ సేవలు పారదర్శకంగా, సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సబ్ కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో బాధ్యతా యుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

## గణేశ్ మండపాలలో పూజలు,అన్నదాన కార్యక్రమాలలో పాల్గొన్న సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

**- మార్వాడి మందిర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించిన కోమటిరెడ్డి..**



**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 19(పిసిడబ్ల్యూ న్యూస్):** గణేశ్ నవరాత్రోత్సవాలలో భాగంగా సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మార్వాడి మందిర్ లోని గణేశ్ మంటపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు, మార్వాడీ మందిర్ నిర్వాహకులు కమల్ సోనీ మధు,వేణు వసావా,పవన్ ముందాడ తదితరులు నరేందర్ రెడ్డి ని ఆహ్వానించారు. గణేష్ పూజ అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వెంకటేశ్వర స్వామి దర్శనం అన్నమయ్యచే ప్రసాదం స్వీకరించే కార్యక్రమంలో పాల్గొన్నారు. వటేల్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సంతోష్ నగర్ లోని గణేష్ మండపంలో,గడమల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జ్యోతినగర్ లోని గణేష్ మండపంలో,భాగ్యనగర్ లోని గణేష్ చౌరస్తా వద్ద గల గణేష్ మండపంలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.



## జాతీయ జనగణనలో బీసీలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలి

**కేంద్రంపై ఒత్తిడికి జాతీయ స్థాయి ఉద్యమం చేపట్టాలి**

**మంత్రి పొన్నం ప్రభాకర్‌కు జాతీయ బీసీ దళ్ వినతి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 19(పిసిడబ్ల్యూ న్యూస్):** జాతీయ జనగణనలో బీసీ/ఓబీసీల కోసం ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేసి, కులాల వారీగా సమగ్ర వివరాలు సేకరించాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు, బీసీ రిజర్వేషన్ సాధన సమన్వయ జేఏసీ చైర్మన్ దుండ్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. శనివారం ఆయన తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. దుండ్ర కుమారస్వామి మాట్లాడుతూ... జాతీయ జనగణనలో బీసీలను చేర్చాలని కోరుతూ తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేయడం హర్షణీయమన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి దేశవ్యాప్తంగా ఉన్న బీసీ సంఘాలు, సామాజిక సంస్థలు, ప్రజాప్రతి నిధులు, అన్ని రాజకీయ పార్టీలను




కలుపుకొని జాతీయ స్థాయిలో మహా ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. రాబోయే జాతీయ జనగణనలో బీసీ/ఓబీసీలకు ప్రత్యేక కేటగిరీని చేర్చడం ద్వారా వారి సామాజిక, ఆర్థిక, విద్యా స్థితిగతులపై స్పష్టమైన గణాంకాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించిన బీసీ కులాల జాబితాల ఆధారంగానే ఈ వివరాలను నమోదు చేయాలని కోరారు. బీసీ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, అన్ని పక్షాలను ఒకే తాటిపైకి తీసుకురావాలని ఆయన సూచించారు. తెలం గాణలో నిర్వహించిన సమగ్ర కుల సర్వే అనుభవాలను పరిగణనలోకి తీసుకొని, శాస్త్రీయ పద్ధతిలో ఖచ్చిత మైన సమాచారాన్ని సేకరించాలన్నారు. 2011 నాటి సామాజిక, ఆర్థిక కుల గణనలో తలెత్తిన సాంకేతిక లోపాలు పునరావృతం కాకుండా కేంద్రం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని గుర్తుచేశారు. విద్య, ఉపాధి, సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయం చేకూరాలంటే బీసీల కచ్చితమైన లెక్కలు తప్పనిసరని, హక్కుల సాధన కోసం ప్రజాస్వామ్యబద్ధమైన ఉద్యమాలకు అందరూ కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

# విద్యకు కాషాయికరణ ప్రమాదం



**పేదలను విద్యకు దూరం చేస్తున్న పాలకుల విధానాలు**

**విద్యార్థి ఉద్యమాల సారధి ఏఐఎస్ఎఫ్**

**ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్**



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్) :** భారతదేశంలో విద్య కాషాయికరణ ప్రమాదంలో ఉందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్ తెలిపారు. విద్యను కాషాయికరణ చేయడంతో పాటు చరిత్రను వక్రీకరించేందుకు ప్రయత్నం జరుగుతుందని పసి మెదళ్లలో మతోన్మాదాన్ని నింపుతున్నారని ఆయన ఆరోపించారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఖమ్మం జిల్లా 28వ మహాసభలు శనివారం స్థానిక ఐఎంఏ హాల్ లో జరిగాయి. మహాసభలను పురస్కరించుకుని పాత సిపిఐ కార్యాలయం నెహ్రూ నగర్ నుండి పాత బస్టాండ్ మయూరిసెంటర్ మీదుగా పోటు ప్రసాద్ నగర్ (ఐఎంఏ హాల్) వరకు విద్యార్థి ప్రదర్శన నిర్వహించారు. 28వ మహాసభకు గుర్తుగా 28 మంది విద్యార్థులు ఏఐఎస్ఎఫ్ పతాకాలను ధరించి ముందు నడిచారు. ఈ ప్రదర్శనలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. మహాసభలను పురస్కరించుకుని ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణ ఆవిష్కరించారు. మడుపల్లి లక్ష్మణ్, బుర్రా మనోజ్, అమృత అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన మహాసభల్లో పుట్టా లక్ష్మణ్ మాట్లాడుతూ... బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత క్రమేపి విద్యా విధానాన్ని మారుస్తూ వచ్చిందని శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పరుగులు పెడుతున్న నేటి తరుణంలో చాందస వాదాన్ని పసిమెదళ్లలోకి చొప్పించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బడ్జెట్లో విద్యకు నిధుల కేటాయింపు పూర్తిగా తగ్గిపోయిందని కేటాయించిన బడ్జెట్ను కూడా ఖర్చు చేయడం లేదని లక్ష్మణ్ ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే విద్యకు అత్యంత ప్రాధన్యతనిస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి పాలన ఆ ఆదిశగా సాగడం లేదన్నారు. ఫీజు రీయంబర్స్మెంట్ విషయంలో ఆయన ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి పేద, మధ్యతరగతి విద్యార్థులను విద్యకు దూరం చేస్తుందన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంతో పాటు ప్రైవేటులో ఫీజులను నియంత్రించాల్సిన ఈ ప్రభుత్వం తీవ్ర వైఫల్యం చెందిందన్నారు. ఏఐఎస్ఎఫ్ భారతదేశంలోనే అతి గొప్ప విద్యార్థి సంఘమని స్వాతంత్ర్యానికి ముందు స్వాతంత్ర్యం తర్వాత అనేక ప్రజా ఉద్యమాలను నిర్మించిన ఘన చరిత్ర ఏఐఎస్ఎఫ్కు ఉందన్నారు. విద్యారంగ సమస్యలపైనే కాకుండా సామాజిక సమస్యలు, నిరుద్యోగం తదితర సమస్యలపై ఏఐఎస్ఎఫ్ పోరాడుతూ విద్యార్థి ఉద్యమ సారధిగా నిలిచిందన్నారు. అనేక మంది యోధులు ఏఐఎస్ఎఫ్ పనిచేశారని వారందరి స్ఫూర్తితో ఏఐఎస్ఎఫ్ బహుముఖ పోరాటాల ద్వారా విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందన్నారు. ఏఐఎస్ఎఫ్ సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ... ప్రస్తుతం భారతదేశ విద్యారంగం ఒక సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటుందని పోరాటాలు మాత్రమే ఈ సమస్యకు పరిష్కారం చూపుతాయన్నారు. విద్య అంగడి వస్తువుగా మారిందని కొనుగోలు శక్తి ఉన్న వారికే విద్య "అందుబాటులో ఉందన్నారు. ఈ విధానానికి వ్యతిరేకంగా ఏఐఎస్ఎఫ్ నేతృత్వంలో పోరాడాలని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ మహాసభల్లో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, ఇంచార్జి రావిశివరామకృష్ణ, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బత్తినేని నీరజ, ఏపూరి లతాదేవి, ఏఐవైఎఫ్ నాయకులు మామిళ్ల శ్రీనాథ్ రెడ్డి, చింతల రమేష్, ఏఐఎస్ఎఫ్ నాయకులు అజిత్ తదితరులు పాల్గొన్నారు.

# కన్నీటి వేళ.. క్లాసుమేట్ కుటుంబానికి ఆపన్నహస్తం

**- భర్తను కోల్పోయిన స్నేహితురాలి**

**కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం..**

**- స్నేహానికి నిలువెత్తు నిదర్శనంగా**

**నిలిచిన 200506 బ్యాచ్ మిత్రులు**



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కష్టాల్లో ఉన్నప్పుడు తోడుగా నిలిచే స్నేహమే అసలైన స్నేహం.. కన్నీటిని తుడిచే చేయే నిజమైన మానవత్వం. అప్పుడిని కోల్పోయి విషాదంలో ఉన్న తమ క్లాసుమేట్ కుటుంబానికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు ఖమ్మం జిల్లా, కామేపల్లి మండలం జడ్పీఎస్ఎస్ ముచర్లజాస్తిపల్లి పాఠశాల 20052006 బ్యాచ్ పదో తరగతి క్లాస్మేట్స్.తమ క్లాస్మేట్ సఫియా భర్త నాగుల్ మీరా ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో, ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఈ విషయం తెలుసుకున్న పాత స్నేహితులు కేవలం పరామర్శలకే పరిమితం కాకుండా.. ఆ కుటుంబానికి తమ వంతు అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు. మిత్రులంతా కలిసి శనివారం రూ.50,000 ఆర్థిక సహాయాన్ని సఫియా కుటుంబానికి అందజేశారు.ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న స్నేహితులు.. కాలం గడిచినా తమ స్నేహబంధాన్ని మరచిపోలేదు. జీవితంలో ఎవరికి కష్టం వచ్చినా తామున్నామంటూ భరోసా కల్పించడమే నిజమైన స్నేహమని నిరూపించారు. భర్తను కోల్పోయిన కుటుంబానికి ఆర్థికంగా కొంత ఊరటనిచ్చేలా తమ వంతు సహాయాన్ని అందించి, సఫియా కుటుంబానికి అండగా నిలిచారు.ఈ సందర్భంగా ఎన్. నాగరాజు, ఎ. నాగరాజు, జి. సతీష్, తిరుమలరావు, హరీష్, సంతోషి, పుష్పలత తదితర మిత్రులు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న స్నేహితురాలి కుటుంబానికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావించామని తెలిపారు. డబ్బు విలువ కంటే కష్టకాలంలో చూపించే ఆప్యాయత, ఆత్మీయత, అండదండలే గొప్పవని పేర్కొన్నారు.కష్ట సమయంలో చేయూతనిచ్చిన ఆ స్నేహహస్తం.. కోల్పోయిన వ్యక్తిని తిరిగి తీసుకురాలేకపోయినా, విషాదంలో ఉన్న కుటుంబానికి "మీకు మేమున్నాం" అనే భరోసాను అందించింది. స్నేహానికి కాలంతో సంబంధం లేదని, ఆపదలో తోడుగా నిలిచినప్పుడే ఆ బంధం విలువ మరింత వెలుగులోకి వస్తుందని ఈ మిత్రుల ఆపన్నహస్తం చాటిచెప్పింది.

# భక్తి పరిమళం.. కుంకుమ పూజ వైభవం



**గణనాథుడి సన్నిధిలో మహిళల భక్తిశ్రద్ధలు.. సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ప్రజలు వర్ధిల్లాలని ప్రత్యేక ప్రార్థనలు**

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్) :** విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి సన్నిధిలో భక్తి పరిమళాలు వెదజల్లాయి. ఆధ్యాత్మికత, భక్తిశ్రద్ధలు, సౌభ్రాతృత్వం వెల్లివిరిసేలా ఖమ్మం నగరంలోని 1వ డివిజన్ మారుతీనగర్ రోడ్ నెంబర్ 9లో శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శనివారం కుంకుమ పూజను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కాలనీకి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంతో మారుతీనగర్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

మహిళల భక్తి, మంగళహారతులు, గణపతి నామస్మరణలతో పరిసరాలు భక్తి భావంతో పులకించాయి.ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని భక్తులు గణనాథుడిని ప్రార్థించారు. దేశంపై ఎల్నినో ప్రభావం తగ్గి సమృద్ధిగా వర్షాలు కురవాలని, పాడిపంటలు పుష్కలంగా పండించి దేశానికి అన్నం పెట్టే రైతన్నల కుటుంబాల్లో ఆనందం నిండాలని ఆకాంక్షించారు. కుంకుమ పూజ అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి మహిళకు శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక బహుమతులు అందజేశారు. భక్తులను గౌరవిస్తూ బహుమతులు అందించడం ద్వారా ఉత్సవ కమిటీ ఆత్మీయతను చాటుకుంది.ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ చైర్మెన్ బన్సిలాల్ మాట్లాడుతూ.. వినాయకుడి ఉత్సవాలు కేవలం ఆధ్యాత్మిక వేడుకలకే పరిమితం కాకుండా ప్రజల మధ్య ప్రేమ, సోదరభావం, ఐక్యతను పెంపొందించే వేదికలుగా నిలవాలని ఆకాంక్షించారు. కుల, మత, ప్రాంత భేదాల కు అతీతంగా మానవులంతా ఒక్కటిగా, సోదరభా వంతో కలిసి మెలిసి జీవించాలి అని పిలుపునిచ్చారు.కుంకుమ పూజకు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల సహకారంతో భవిష్యత్తులో మరిన్ని ఆధ్యాత్మిక, సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. బాలునాయక్, నగేష్, రాజు, మాణిక్ చంద్, నాగార్జున రెడ్డి, బోడా లక్ష్మణ్, ఉపేందర్, బీమా, కిరణ్, రవి, హరి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనగర్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**● లబ్ధిదారులకు కార్డులు అందజేసిన సర్పంచ్ ఆకుల మల్లేష్**




**మల్లంపల్లి మండల ప్రతినిధి సెప్టెంబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్):** శ్రీనగర్ గ్రామపంచాయతీ పరిధిలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆకుల మల్లేష్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.కార్డుల పంపిణీ సందర్భంగా లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు గుగులోతు లచ్చిరాం, ఉపాధ్యక్షుడు కొట్టె ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని దానాల్లో అన్నదానం గొప్ప: తాసిల్దార్ దాసరి రాజ మల్లయ్య,ఎస్ఐకే రాజు



**రామడుగు సెప్టెంబర్ 19(పిసిడబ్ల్యూ న్యూస్):** వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని రామడుగు గ్రామంలో మాల సంఘం కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గణేష్ నిహ వేడుకల సందర్భాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ అన్నదానానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.ఈ సందర్భంగా ఎస్సై కే రాజు, తాసిల్దార్ దాసరి రాజ మల్లయ్య, మాట్లాడుతూ.. విఘ్నేశ్వరుని కృపతో ఏటా ఈ ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. కేవలం పూజలు, భజనలకే పరిమితం కాకుండా, 'అన్నదానం మహాదానం' అనే సంకల్పంతో ప్రతి ఒక్కరికీ స్వామివారి ప్రసాదాన్ని అందజేయడం సంతోషంగా ఉందన్నారు. , ఉత్సవ కమిటీ సభ్యులు.స్వచ్ఛంద సేవకులు పూర్తి సహకారాన్ని అందించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్నదాన వేదిక వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వచ్చిన ప్రతి ఒక్కరికీ కమిటీ సభ్యులు స్వయంగా వడ్డించి, క్రమశిక్షణతో ప్రసాద వితరణ సాగేలా పర్యవేక్షించారు. అన్నదాన కార్యక్రమం విజయవంతం కావడంతో నిర్వాహకులు భక్తులకు, సహకరించిన కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి మొయిజ్, 14వ వార్డ్ మెంబర్ సిరికొండ పల్లవి సాయి, ఉత్సవ కమిటీ మెంబర్స్, భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 33వ డివిజన్ కోకార్పొరేటర్ ఇక్రామ్ సికిందర్ తల్లి హఠాన్మరణం..

**- పరామర్శించిన ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, సుడా మాజీ చైర్మన్ నరేందర్ రెడ్డి..**



**కరీంనగర్, సెప్టెంబర్ 19(పిసిడబ్ల్యూ న్యూస్):** నగరంలోని 33వ డివిజన్ హుస్సేనీ పుర కోకార్పొరేటర్ ఇక్రామ్ సికిందర్ తల్లి ఆయేషా నఫీజ్ (60) శనివారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ హఠాన్మరణం చెందారు. మరణ వార్త సమాచారం తెలుసుకొని ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిలు ఇక్రామ్ సికిందర్ నివాసానికి చేరుకొని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపి.. ధైర్యం చెప్పారు. ఎంఐఎం జాయింట్ సెక్రటరీ హాఫిజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి, కార్పొరేటర్లు సయ్యద్ ఇబ్రహీం, మాజిద్ హుస్సేన్, కల్లెపల్లి బాల్ రాజు, ఎంఐఎం నాయకులు అబ్దుల్ గఫ్ఫార్, ఫసియుద్దీన్ ఖాలీద్, వాజిద్ అలీఖాన్, ఖాజా మజారోద్దీన్, వసీం, మెరాజోద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

# మెడిసిన్ సీటు సాధించిన రోకటి సుష్మకు ఆర్థిక సాయం..అభినందనలు : శెట్టి



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జూలూరుపాడు మండలం పాపకొల్లు గ్రామానికి చెందిన రోకటి రమేష్ – ప్రమీల చిన్న కూతురు రోకటి సుష్మ ఏంబిబిఎస్ సీటు సాధించిన సందర్భంగా ఖమ్మం రాపర్తి క్యాంప్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. అనంతరం అభినందనలు తెలుపుతూ ఆర్థిక సహకారం అందించారు. మున్నూరు కాపు పటేల్స్ రాష్ట్ర అధ్యక్షులు కొండా దేవయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ శెట్టి రంగారావు, ట్రస్టు బోర్డు చైర్మన్ కనకం జనార్ధన్ రావు, కార్యదర్శి కనిశెట్టి నర్సయ్య, జిల్లా కోశాధికారి మదూరీ పూర్ణ చందర్ రావు, సీనియర్ నాయకులు కాపు జేఏసీ చందు జనార్ధన్, డాక్టర్ గడల శ్రీనివాసరావు, తీగల విజయ్, రాపర్తి శరత్ కుమార్, డాక్టర్ జాబిశెట్టి గౌతమ్, ముత్యం ఉప్పలరావు, సముద్రాల శ్రీనివాసరావు, జిల్లా యూత్ అధ్యక్షులు తోట రమేష్, సూరపనేని బాబురావు, గంగిశెట్టి శ్రీనివాస్, సి హెచ్ విప్లవ కుమార్, పసుపులేటి నాగేశ్వరరావు, బైరిశెట్టి శ్రీనివాసరావు, తాళ్లూరి సోమయ్య, రామిశెట్టి సత్యనారాయణ, వెంపటి నాగేశ్వరరావు నాయుడు, రాపర్తి అరవింద్, రంగిశెట్టి వరుణ్, కాసం వినయ్, జి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రానున్న కాలంలో మంచిగా చదువుకుని మంచి డాక్టర్ గా రాణించాలని ఆకాంక్షించారు. కష్టపడి చదివించిన తల్లి తండ్రులనూ సన్మానించి అభినందనలు తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలి: మండల ప్రత్యేక అధికారి

### సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలి

**కమలాపూర్, సెప్టెంబర్ 19 (పీసీడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో గుండె బాబు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో మండలంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు అధికారులకు సహకరిస్తూ సమస్యలను తమ దృష్టికి తీసుకురావడం అభినందనీయమన్నారు. ప్రజలకు, ప్రజాప్రతినిధులకు అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రభుత్వ నిబంధనల మేరకు సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ఎంపీడీవో గుండె బాబు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి పరిష్కరించేందుకే మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.






సమావేశంలో చర్చించిన సమస్యలకు సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యతనిచ్చి పరిష్కారం చూపాలని కోరారు. కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్ పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు. భీంపల్లి సర్పంచ్ వాసాల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం అధికారులు విధులు నిర్వహిస్తూ ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రాజేష్ మాట్లాడుతూ గత సర్వసభ్య సమావేశంలో చర్చించిన పలు సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదని, అధికారులు సమస్యల పరిష్కారంలో జాప్యం చేయడం సరికాదన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ పంచాయతీల విద్యుత్ బిల్లుల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు సర్పంచులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఇదే సమయంలో సమావేశానికి కొంతమంది అధికారులు హాజరుకాక పోవడంపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఎక్సైజ్ శాఖ అధికారుల గైర్హాజరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రజా సమస్యలపై జరిగే సర్వసభ్య సమావేశాలకు సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్వో సురేష్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీరాణి, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ కమలాపూర్ లక్ష్యంగా ప్రతి శనివారం శ్రమదానం

**• స్వచ్ఛ కమలాపూర్ మా లక్ష్యం: సర్పంచ్ పబ్బు సతీష్**




**కమలాపూర్, సెప్టెంబర్ 19 (పీసీడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో సంపూర్ణ పారిశుధ్యమే లక్ష్యంగా సర్పంచ్ పబ్బు సతీష్ ఆధ్వర్యంలో చేపట్టిన 'ఊరు కోసం ఒక్కరోజు శ్రమదానం' కార్యక్రమం ప్రతి శనివారం కొనసాగుతోంది. ఇందులో భాగంగా శనివారం రావిచెట్టు నుంచి గ్రామపంచాయతీ, పోలీస్‌స్టేషన్ రోడ్డు వరకు గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, యువకులతో కలిసి శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారి వెంట ఉన్న ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. గ్రామంలో పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ప్రతి ఒక్కరూ స్వచ్ఛతలో భాగస్వాములు కావాలని సర్పంచ్ పబ్బు సతీష్ పిలుపునిచ్చారు. 'స్వచ్ఛ కమలాపూర్' సాధించడమే తమ లక్ష్యమని తెలిపారు. ప్రతి శనివారం నిర్వహిస్తున్న శ్రమదాన కార్యక్రమంపై గ్రామస్థులు, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ అభివృద్ధి, పారిశుధ్యం కోసం ప్రజాప్రతినిధులు చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని పలువురు అభినందించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బండి రవీందర్, వార్డు సభ్యులు మార్క అశోక్, పిల్లి సతీష్, రాంశెట్టి రాజయ్య, తుమ్మ రాజేష్, గంధసిరి బిక్షపతి, పుల్ల శ్రీనివాస్, పుల్ల ఐలయ్య, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

# మల్లంపల్లిలో జిల్లా స్థాయి కబడ్డీ ఎంపికలు



**మల్లంపల్లి, సెప్టెంబర్ 19 (పీసీడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం మల్లంపల్లిలో జిల్లా స్థాయి కబడ్డీ క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలకు 300 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమానికి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పోలేపాక జనార్ధన్, కొత్తగూడ ఎస్సై ఇమ్మడి రాజ్‌కుమార్, ఏఆర్ఎస్ఐ వరంగల్ బోయిని శరత్, డాక్టర్ రవి, కాంగ్రెస్ మల్లంపల్లి మండల అధ్యక్షుడు చేరుకుపల్లి శ్రీకాంత్ రెడ్డి, మోత్రి రాజు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు చింత కృష్ణ, గోగు రాజయ్య, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు. ఎంపికల కార్యక్రమాన్ని బత్తిని సురేష్, చేరుమల సురేందర్, గంట శ్రీను సమన్వయంతో నిర్వహించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన క్రీడాకారులు, నిర్వాహకులు, సహకరించిన ప్రతి ఒక్కరికీ ములుగు జిల్లా కబడ్డీ అసోసియేషన్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

# పిడుగుపాటుకు మహిళ మృతి

**- గడ్డి కోయడానికి పొలానికి వెళ్లిన దంపతులు ఒక్కసారిగా పిడుగు**



**కల్లూరు, సెప్టెంబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్)** :పిడుగుపాటుకు గురై ఓ మహిళ మృతి చెందిన విషాద ఘటన కల్లూరు మండలం పాత ఎర్రబోయినపల్లి గ్రామంలోని విద్యానగర్ కాలనీలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నల్లగట్ల జమాయమ్మ (భర్త లాజర్) శనివారం పిడుగుపాటుకు గురై మృతి చెందారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. జమాయమ్మ తన భర్తతో కలిసి గడ్డి కోయడానికి పొలం వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో ఒక్కసారిగా పిడుగు పడటంతో జమాయమ్మ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే కుప్పకూలారు. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం కల్లూరు ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. జమాయమ్మ మృతితో విద్యానగర్ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు స్థానికులను కలచివేశాయి.

# న్యాయవ్యవస్థపోలీసుల సమన్వయంతో కేసుల త్వరిత పరిష్కారానికి చర్యలు


**- పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం**




**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్19(పిసిడబ్ల్యూ న్యూస్):** కేసుల త్వరిత పరిష్కారం, న్యాయ ప్రక్రియలో జాప్యాన్ని తగ్గించే లక్ష్యంతో కరీంనగర్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని అస్త్ర కన్వెన్షన్ హాల్‌లో న్యాయవ్యవస్థ, పోలీస్ శాఖ అధికారుల ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు. కరీంనగర్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి శ్రీ ఎస్. శివకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో న్యాయవ్యవస్థ, పోలీస్ శాఖల మధ్య పరస్పర సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం, ఆన్‌లైన్ న్యాయ ప్రక్రియలను సమర్థవంతంగా అమలు చేయడం, కేసుల పురోగతిని పర్యవేక్షించడం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. **డిజిటల్ విధానంతో న్యాయ ప్రక్రియ మరింత వేగవంతం** న్యాయమూర్తి శ్రీ ఎస్. శివకుమార్ మాట్లాడుతూ కొత్త క్రిమినల్ చట్టాల నేపథ్యంలో న్యాయవ్యవస్థలో డిజిటలైజేషన్, ఎలక్ట్రానిక్ ఆధారాల నిర్వహణకు ఎంతో ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. ఇంటర్ ఆపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ ద్వారా 'వన్ డేటావన్ ఎంట్రీ' విధానాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. పోలీస్ దర్యాప్తు, ఫోరెన్సిక్ నివేదికలు, కోర్టు రికార్డులను ఒకే డిజిటల్ వ్యవస్థకు అనుసంధానం చేయడం ద్వారా సమయం ఆదా కావడంతో పాటు కేసుల విచారణలో పారదర్శకత పెరుగుతుందని వివరించారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఈఎఫ్ఐఆర్, ఈచార్జ్‌షీట్, డిజిటల్ సమన్లు, వర్చువల్ విధానంలో సాక్షుల విచారణ వంటి ఆధునిక పద్ధతులను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు న్యాయశాఖ, పోలీస్ శాఖల మధ్య నిరంతర సమన్వయం అవసరమని పేర్కొన్నారు. **పరస్పర సహకారంతో కేసుల పరిష్కారంలో వేగం** పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ న్యాయవ్యవస్థ, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేయడం ద్వారా కేసుల పరిష్కార ప్రక్రియను మరింత వేగవంతం చేయవచ్చన్నారు. కోర్టు సంబంధిత వివిధ ప్రక్రియల్లో ఎదురయ్యే జాప్యాన్ని తగ్గించేందుకు రెండు శాఖల మధ్య సమర్థవంతమైన సమన్వయం అవసరమని తెలిపారు. ICJS, CCTNS పరిధిలో అమలవుతున్న ఆన్‌లైన్ సేవలను సమీక్షిస్తూ ఈఎఫ్ఐఆర్, ఈచార్జ్‌షీట్, ఈసమ్మన్స్ తదితర అంశాలపై అధికారులు చర్చించారు. **ఈఎఫ్ఐఆర్, ఈచార్జ్‌షీట్‌లపై ప్రత్యేక దృష్టి** సంబంధిత కోర్టుల్లో ఈఎఫ్ఐఆర్‌లు సకాలంలో స్వీకరించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈఎఫ్ఐఆర్ స్వీకరణ సమయంలో పీటీఎన్ నంబర్ నమోదు చేసి, ప్రక్రియను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని తెలిపారు. అదేవిధంగా ఈచార్జ్‌షీట్‌లను నిర్ణీత కాలవ్యవధిలో సంబంధిత కోర్టులు స్వీకరించేలా పోలీస్, న్యాయశాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దీంతో కేసుల దాఖలు, విచారణలో అనవసర జాప్యాన్ని నివారించవచ్చని తెలిపారు. **ఈసమ్మన్స్ వినియోగానికి ప్రాధాన్యత** అవసరమైన సందర్భాల్లో సాక్షులు, నిందితులకు భౌతిక సమన్లకు బదులుగా ఈసమ్మన్స్ ద్వారా సమన్లు జారీ చేసే విధానాన్ని ప్రోత్సహించాలని సమావేశంలో చర్చించారు. ఈ విధానం ద్వారా సమన్ల జారీ, అమలులో మరింత వేగం, సామర్థ్యం సాధించవచ్చని తెలిపారు. న్యాయవ్యవస్థ, పోలీస్ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా కోర్టు సంబంధిత ప్రక్రియలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించవచ్చని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. ఈ సమావేశంలో న్యాయమూర్తులు, పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కర్నూలు నగరంలోని బి క్యాంప్ లో ఉన్న 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**కర్నూలు సెప్టెంబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్)** : బి క్యాంప్ లో ఉన్న 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలో విద్యుత్ సరఫరా, పంపిణీ వ్యవస్థ, తదితర అంశాలను విద్యుత్ శాఖ అధికారులు కలెక్టర్ కు ప్రాక్టికల్‌గా వివరించారు. సంబంధిత సబ్‌స్టేషన్ నుంచి అరోరా నగర్, మిలటరీ కాలనీ, బి–క్యాంప్, సి–క్యాంప్, గాయత్రీ ఎస్టేట్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా జరుగుతుందని, సబ్‌స్టేషన్‌లో విజ్ఞాన మందిరం, హౌసింగ్ బోర్డు, అరోరా నగర్ తదితర ప్రాంతాలకు సంబంధించిన 11 కేవీ ఫీడర్లు ఉన్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. 220 కేవీ నుంచి 33 కేవీకి, అనంతరం 33 కేవీ నుంచి 11 కేవీకి, చివరగా స్థానిక డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా 11 కేవీని 440 వోల్టులకు తగ్గించి వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేసే విధానాన్ని సబ్‌స్టేషన్‌లోని పరికరాలను చూపిస్తూ విద్యుత్ అధికారులు కలెక్టర్ కు వివరించారు. ప్రజలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడిసిఎల్ ఎస్ఈ ప్రదీప్ కుమార్, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, కల్లూరు తహసిల్దార్ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా శ్రీ సాయి గణేష్ పద్మశాలి ఉత్సవ కమిటీ వారి కుంకుమ పూజ





**ఖమ్మం, ప్రతినిధి సెప్టెంబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్)** :ఖమ్మం నగరంలోని 40వ డివిజన్‌లో శ్రీ గణేష్ పద్మశాలి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 21వ వినాయకుడి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కుంకుమ పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘ పెద్దలు మాట్లాడుతూ వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు పద్మశాలి కళ్యాణ మండపం నందు ప్రతి సంవత్సరం శ్రీ గణేష్ పద్మశాలి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలు నిర్వహిస్తాము అని మాకు కుల బాంధవులు అందరూ కూడా సహకరిస్తారని అదేవిధంగా ఈ గణేష్ మండపం వద్ద ఎటువంటి కోరికలు కోరుకున్న వెంటనే నెరవేరుతాయి అని ఇక్కడ మహిళా భక్తులు అపారంగా నమ్ముతున్నారని అన్నారు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజ నిర్వహించడం ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పెంచింది అని పేర్కొన్నారు కుంకుమ పూజ అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి మహిళకు శ్రీ గణేష్ పద్మశాలి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ గణేష్ పద్మశాలి ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ 21వ వినాయకుడి వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన కుంకుమ పూజకు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు భవిష్యత్తులో కూడా భక్తుల సహకారంతో మరిన్ని ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో కూరపాటి సతీష్, అమృతం మల్లికార్జున్, చిలుకోటి శ్రీనివాస్ రావు, వలన కొండ నరసింహారావు, గుర్రం రవీంద్రనాథ్ (కవి) ముసునూరి వెంకటేశ్వర్లు, మేక జగదీష్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి ఘనంగా మహా అన్నదానం

● శ్రీ కనకదుర్గ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు



**ములుగు జిల్లా బండారుపల్లి సెప్టెంబర్19(పిసిడబ్ల్యూ న్యూస్):** శ్రీ కనకదుర్గ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్న మట్టి గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా మట్టి గణపతిని ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తూ, ఉత్సవాల్లో భాగంగా భక్తులకు మహా అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ మహా అన్నదాన కార్యక్రమాన్ని అన్నదాన కర్తలు ఇండ్ల రమరాజేందర్, అరిగెల అరుణరాహుల్ దంపతులు నిర్వహించారు. కార్యక్రమానికి సహకరించిన అన్నదాతలకు శ్రీ కనకదుర్గ ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి రోజు గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా షోడశోపచార పూజలు, కుంకుమార్చన తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ పూజా కార్యక్రమాలు శ్రీ బుసిగొండ సందీపాచార్యుల ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమాలను శ్రీ కనకదుర్గ ఉత్సవ కమిటీ అధ్యక్షులు ముద్దసాని మహేందర్, ఉపాధ్యక్షులు కేత్తే సురేష్, కేశెట్టి నవీన్తో పాటు కమిటీ సభ్యులు సమన్వయంతో నిర్వహిస్తున్నారు. మట్టి గణపతిని ప్రతిష్ఠించి ప్రతి సంవత్సరం నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# తెలంగాణ గ్రామర్ స్కూల్‌లో 3డి ప్లానిటోరియం ప్రదర్శన





**కల్లూరు, సెప్టెంబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ గ్రామర్ స్కూల్‌లో విద్యార్థులకు ఖగోళ విజ్ఞానంపై అవగాహన కల్పించే ఉద్దేశంతో 3డి ప్లానిటోరియం ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు 3డి సాంకేతికత ద్వారా సౌర కుటుంబం, గ్రహాలు, నక్షత్రాలు, అంతరిక్ష విశేషాలను ఆసక్తికరంగా వీక్షించారు. 3డి ప్లానిటోరియం ప్రదర్శన విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంది. పుస్తకాల ద్వారా నేర్చుకున్న ఖగోళ విజ్ఞానాన్ని ప్రత్యక్ష అనుభూతి రూపంలో తెలుసుకోవడంతో విద్యార్థుల్లో ఆసక్తి, ఉత్సుకత పెరిగింది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం, పరిశోధనా ఆసక్తి పెంపొందుతుందని పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఇస్మాయిల్ మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు వినూత్నమైన అనుభవాత్మక విద్యను అందించడమే పాఠశాల లక్ష్యమని తెలిపారు. విద్యార్థులకు ఇటువంటి శాస్త్రీయ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్వచ్ఛంద్రా సాధనతోనే స్వర్ణాంధ్ర

● ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ జయకృష్ణ




**తిరుపతి సెప్టెంబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్) :** స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర సాధ్యమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. స్వచ్ఛత అనేది పారిశుద్ధ్య కార్మికుల బాధ్యత మాత్రమే కాదని ప్రతి ఒక్కరి బాధ్యతని ఆయన గుర్తు చేశారు. స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్రలో భాగంగా శనివారం ఉదయం ఎన్జీవో కాలనీలోని మాల్వాడిగుండం కాలువను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కార్పొరేషన్ అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు కలిసి శుభ్రం చేసి, మొక్కలు నాటారు. స్వచ్ఛత ఉన్న చోటే ఆరోగ్యం ఉంటుందని ఆరోగ్యం ఉన్న చోటే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. అభివృద్ధి సాధిస్తేనే సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, యువ నాయకులు, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ల లక్ష్యమైన స్వర్ణాంధ్ర సాధ్యమని ఆయన చెప్పారు. మన ఇల్లు ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో, మన వీధిని, మన కాలనీని, మన నగరాన్ని కూడా అంతే బాధ్యతతో పరిశుభ్రంగా ప్రతి ఒక్కరూ ఉంచుకోవాలని ఆయన కోరారు. నగరపాలక సంస్థ కమిషనర్ జయకృష్ణ మాట్లాడుతూ పుణ్యక్షేత్రమైన తిరుపతి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచి, సుందర నగరంగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కలిసి రావాలని అన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా, తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు ప్రజలు అందించాలని ఆయన కోరారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పరిశుభ్ర నగరంగా తిరుపతిని నిలపడంలో యువత కీలక పాత్ర పోషించాలని ఆయన కోరారు. పరిసరాల పరిశుభ్రతకు కట్టుబడి ఉంటామని అందరి చేత కమిషనర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, టీటిడి బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, గంగమ్మ గుడి చైర్మన్ మహేష్ యాదవ్, ఇంచార్జి జె.బి. శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మాజీ కార్పొరేటర్ అన్నా అనిత, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది, ఎన్ సిసి కాడేట్లు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జన ఏర్పాట్లు ఘనంగా నిర్వహిస్తాం..

## భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు: మేయర్ కొలగాని శ్రీనివాస్




**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 19(పిసిడబ్ల్యూ న్యూస్):** గణేష్ నిమజ్జన వేడుకలు విజయవంతంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలో ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్న గణేష్ నిమజ్జన కార్యక్రమం ఏర్పాట్లపై శనివారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో మేయర్ కొలగాని శ్రీనివాస్ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, పారిశుధ్య విభాగాల అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. నిమజ్జన కార్యక్రమానికి సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, షిఫ్టుల వారీగా అధికారులు, సిబ్బంది నిర్వర్తించాల్సిన విధులపై సుదీర్ఘంగా చర్చించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే గణేష్ నిమజ్జన ఉత్సవాలు అత్యంత వైభవంగా, ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టి నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మానకొండూర్, కొత్తపల్లి, చింతకుంట, గోపాల్‌పూర్, దుర్శేడ్, బొమ్మకల్ తదితర నిమజ్జన పాయింట్ల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మేయర్ సూచించారు. నిమజ్జన మార్గాలతో పాటు ఘాట్ల వద్ద ముందస్తు భద్రతా చర్యలు చేపట్టి అవసరమైన సౌకర్యాలను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. నిమజ్జన పాయింట్ల వద్ద భారీ కేడ్లు, సీసీ కెమెరాలు, క్రేన్లు, ఎల్ఈడీ స్క్రీన్లు, విద్యుత్ లైటింగ్, తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని కేటాయించి ఎప్పటికప్పుడు పరిశుభ్రతను పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే నిమజ్జన మార్గాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, భక్తులు మరియు గణేష్ మండపాల నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. షిఫ్టుల వారీగా విధులు కేటాయించి, నిమజ్జనం పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మేయర్ ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కమిషనర్ ఆయాజ్, డిప్యూటీ కమిషనర్లు ఖాదర్ మొహియుద్దీన్, వేణుమాధవ్, అసిస్టెంట్ కమిషనర్ రాజమనోహర్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బొడ్డు వినీత్ మృతిపై సమగ్ర విచారణ జరపాలి

## ఎమ్మార్పీఎస్,ఎంఎస్ఎఫ్ జిల్లా నాయకులు విజయ్ మాదిగ, అంజయ్య మాదిగ డిమాండ్

## వినీత్ ది ముమ్మాటికి హత్య ఆత్మహత్య కాదు బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

## వినీత్ తల్లిదండ్రుల డిమాండ్




**సత్తుపల్లి, సెప్టెంబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్) :** బొడ్డు వినీత్ మృతి (28) పై పోలీసులు సమగ్ర విచారణ జరపాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్చార్జి కందికట్ల విజయ్ మాదిగ, ఎం ఎస్ పి జిల్లా అధ్యక్షుడు దురిగంటి అంజయ్య మాదిగ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద వినీత్ తల్లిదండ్రులు బొడ్డు సుబ్బారావు, బొడ్డు సునీల తో కలిసి విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, గత నెల ఆగస్టు 13వ తేదీ తెల్లవారుజామున సత్తుపల్లి పట్టణం రఘురాం హాస్పిటల్ ఎదురు బిల్డింగ్ వద్ద జరిగిన సంఘటన వినీతిది ముమ్మాటికి హత్యనని లేనిపోని అసత్య ఆరోపణలు చేస్తూ కేసును పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని వారు ఆరోపించారు. ఈ సంఘటన జరిగి దాదాపు 40 రోజులు గడిచినప్పటి ఈ కేసులో ఎలాంటి పురోగతి కనిపించలేదని కేవలం దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి హత్య గావించబడితే పోలీసులు ఈ కేసులో బాధ్యులైన అరవింద్, సుధీర్, జ్యోతి లను విచారణ జరిపి దోషులపై చట్టపరమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే జిల్లా పోలీస్ ఉన్నతాధికారులను కలిసి విన్నవించటం జరిగిందని అన్నారు. జిల్లా పోలీస్ ఉన్నత అధికారులు ఆదేశించినప్పటికీ జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కేసును కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్ జోక్యం చేసుకొని దళితులు బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. లేనిపక్షంలో ఖమ్మం జిల్లా పోలీస్ కమిషనర్ ని కలిసి తమ ఆవేదనను వినిపిస్తామని బాధిత కుటుంబానికి తక్షణ న్యాయం జరగకుంటే ఎస్సీ ఎస్టీ కమిషనర్ కలిసి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. బొడ్డు వినీత్ హత్యకు కారకులైన సుధీర్, జ్యోతి, అరవింద్ లను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించాలని బాధితుడి తల్లిదండ్రులు కోరారు. బాధితుడు కుటుంబానికి న్యాయం జరగని పక్షంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కొలికపోగు వెంకటేశ్వరరావు, నియోజకవర్గ నాయకులు గొల్లమందల ముత్తారావు, ఎమ్మార్పీఎస్ నాయకులు తడికమళ్ళ దాసు, ఏపీకి చెందిన రాష్ట్ర నాయకులు అద్దేపల్లి సాగర్, సొరగుడి రాజేష్, గంధం పాండు, నందిగామ అఖిల్, అభి పాల్, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ కిచెన్ వ్యవస్థ దేశానికే స్ఫూర్తిదాయకం

## ఎన్ఐసీడీసీ సీఈఓ, ఎండీ రజత్ కుమార్ సైనీ ప్రశంసలు

## ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన పోషకాహారం అందిస్తున్న జిల్లా కలెక్టర్ కు ప్రశంసలు



**కడప,సెప్టెంబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్) :** విద్యార్థులకు నాణ్యమైన, శుచికరమైన, పోషకాహారాన్ని అందించేందుకు కడప జిల్లా యంత్రాంగం అమలు చేస్తున్న స్మార్ట్ కిచెన్ విధానం దేశానికే స్ఫూర్తిదాయకంగా ఉందని నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఐసీడీసీ) సీఈఓ, ఎండీ రజత్ కుమార్ సైనీ ప్రశంసించారు. శనివారం వల్లూరు మండలం గంగాయపల్లె పీఎం శ్రీ ఏపీ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న స్మార్ట్ కిచెన్‌ను రజత్ కుమార్ సైనీ, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి లతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో వారి వెంట జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, సబ్ కలెక్టర్ భావన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్మార్ట్ కిచెన్‌లో ఆహార పదార్థాల నిల్వ, వంట తయారీ విధానం, పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలు, విద్యార్థులకు భోజనం సరఫరా తదితర అంశాలను ఆయన పరిశీలించారు. అనంతరం స్మార్ట్ కిచెన్ నుంచి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని రజత్ కుమార్ సైనీ స్వయంగా రుచిచూశారు. భోజనం చాలా రుచికరంగా ఉందని, నాణ్యమైన వస్తువులను ఉపయోగించి ఆహారాన్ని తయారు చేయడం గర్వించదగ్గ విషయమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు రుచితో పాటు ఆరోగ్యానికి అవసరమైన పోషకాలు అందేలా భోజనం సిద్ధం చేయడం అభినందనీయమన్నారు. స్మార్ట్ కిచెన్ నిర్వహణ విధానం ఎంతో ఆకట్టుకునేలా ఉందని ఆయన పేర్కొంటూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించేందుకు ఇలాంటి వినూత్న విధానాన్ని అమలు చేయడం మంచి పరిణామమన్నారు. వినూత్న ఆలోచనలతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన పోషకాహారం అందిస్తున్న జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరిని ఆయన అభినందించారు. ఆహార తయారీ నుంచి విద్యార్థులకు అందించే వరకు పరిశుభ్రత, నాణ్యత, సమయపాలనకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు దోహదపడుతున్నారని ప్రశంసించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వేడి, పరిశుభ్రమైన, నాణ్యమైన పోషకాహార మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు, భోజన సమయాన్ని విద్యార్థుల్లో మంచి అలవాట్లను పెంపొందించే అభ్యాస ప్రక్రియగా మార్చేందుకు ఏఎన్‌టీఎస్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. చేతులు శుభ్రం చేసుకోవడం, క్రమపద్ధతిలో భోజనం చేయడం, ఆహారాన్ని వృథా చేయకుండా చూడటం, భోజనం అనంతరం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి అలవాట్లను విద్యార్థుల్లో పెంపొందిస్తున్నామని వివరించారు. స్మార్ట్ కిచెన్ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు ఆహార తయారీ, సరఫరా ప్రక్రియను పర్యవేక్షిస్తున్నామని, విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో మురళి, స్మార్ట్ కిచెన్స్ జిల్లా నోడల్ అధికారి పాల్గొన్నారు.



# సినిమాలకు ఇక కఠిన నిబంధనలు..

## డ్రగ్స్ సీన్లపై తప్పనిసరి హెచ్చరిక!

సినిమాల్లో ఏం చూపించాలనే విషయంలో ఇక మరింత కఠిన నిబంధనలు అమల్లోకి వచ్చాయి. డ్రగ్స్, హింస, లైంగిక హింస, చిన్నారులపై వేధింపుల వంటి సున్నిత అంశాల చిత్రీకరణపై కేంద్రం కొత్త మార్గదర్శకాలు తీసుకొచ్చింది. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ శుక్రవారం సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ)కు సంబంధించిన సవరించిన మార్గదర్శకాలను ప్రకటించింది. 1991లో జారీ చేసిన నిబంధనల స్థానంలో ఇవి వచ్చాయి.డ్రగ్స్ తీసుకోవడం లేదా అక్రమంగా తరలించే సన్నివేశాలు ఉంటే ఇక తెరపై తప్పనిసరిగా హెచ్చరిక కనిపించాలి. »»Illicit narcotics destroy health and guarantees imprisonment. Say No To Drugs” అనే సందేశాన్ని ప్రదర్శించాలి. మద్యం, డ్రగ్స్, పొగాకు అలవాట్లను సమర్థించేలా లేదా గొప్పగా చూపించే సన్నివేశాలు సినిమాల్లో ఉండొద్దని నిబంధనలు చెబుతున్నాయి.

హింసను సమర్థించేలా కానీ, గొప్పగా చూపించేలా కానీ సన్నివేశాలు ఉండకూడదు. మహిళలను కించపరిచే సన్నివేశాలు, లైంగిక వేధింపులు, లైంగిక హింసను అవసరానికి మించి చూపించకూడదు. కథకు తప్పనిసరిగా అవసరమైన సందర్భాల్లోనూ ఇలాంటి సన్నివేశాలను సాధ్యమైనంత తక్కువగా ఉంచాలని నిబంధనలు చెబుతున్నాయి.చిన్నారులను హింసకు బాధితులుగా, హింసకు పాల్పడేవారిగా చూపించడాన్ని కూడా నివారించాలని సూచించారు. పిల్లలపై ఎలాంటి వేధింపులనూ చూపించకూడదు. దివ్యాంగులను ఎగతాళి చేసేలా, అవమానించేలా సన్నివేశాలు ఉండకూడదు. జంతువులపై అనవసరమైన హింసను కూడా చూపించొద్దని నిబంధనల్లో స్పష్టం చేశారు.మతాలు, వర్గాలను కించపరిచేలా ఉండే మాటలు, దృశ్యాలపై ఆంక్షలు కొనసాగనున్నాయి. సామాజిక విద్వేషం, మూఢనమ్మకాలు, శాస్త్రవిరుద్ధ భావనలు, దేశ వ్యతిరేక ధోరణులను ప్రోత్సహించే కంటెంట్‌కు కూడా చోటు ఉండదు. కోర్టుల గౌరవాన్ని దెబ్బతీసే సన్నివేశాలపైనా నిబంధనలు ఉన్నాయి.

# ఆ హాలీవుడ్ రీమేక్‌లో ఉచితంగానైనా నటిస్తా : విజయ్ సేతుపతి



విలక్షణ నటనతో దక్షిణ భారతదేశంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ‘మక్కల్ సెల్వన్’ విజయ్ సేతుపతి తన రాబోయే చిత్రాలు, హాలీవుడ్ రీమేక్ ఆఫర్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల దర్శకుడు నిథిలన్ స్వామినాథన్ తనకు ‘మహారాజా 2’ కథను వినిపించారని, ఆ కథ వినగానే తనకు ఎంతగానో నచ్చిందని వెల్లడించారు. ‘మహారాజా’ మొదటి భాగం విడుదల కాకముందు కొందరు అనుమానాలు వ్యక్తం చేసినప్పటికీ, తాను మాత్రం సినిమా విజయంపై గట్టి నమ్మకంతో ఉన్నానని గుర్తుచేసుకున్నారు.

అంతేకాకుండా, ‘మహారాజా’ సినిమాకు సంబంధించి ఇటీవల హాలీవుడ్ నుంచి ఒక భారీ సర్ ప్రైజ్ వచ్చిందని విజయ్ సేతుపతి తెలిపారు. ఈ సినిమా రీమేక్ హక్కులను హాలీవుడ్ సంస్థ దక్కించుకుందని, అందులో ప్రముఖ హాలీవుడ్ స్టార్ నటుడు మాథ్యూ మెక్‌కొనాహే నటించబోతున్నారని నిర్మాత తనకు ఫోన్ చేసి చెప్పినట్లు వివరించారు. ఈ వార్త విన్నవెంటనే తాను ఎంతో థ్రిల్ అయ్యానని... “ఆ హాలీవుడ్ రీమేక్‌లో నాకు ఒక చిన్న పాత్ర ఇప్పించండి. ఉచితంగా నటిస్తాను“ అని నిర్మాతతో సరదాగా అన్నట్లు పంచుకున్నారు. మొదటి నుంచి హాలీవుడ్‌లో నటించాలనే కోరిక ఉందని, తన చిత్రం అక్కడ రీమేక్ కావడం ఎంతో గర్వంగా ఉందని చెప్పారు.



# ఆస్కార్ రేసులో మరాఠీ చిత్రం ‘గోంధాల్‘..

99వ అకాడమీ అవార్డుల (ఆస్కార్) కోసం భారత్ నుంచి అధికారిక ఎంట్రీగా ఏ చిత్రం వెళ్తుందనే ఉత్కంఠకు తెరపడింది. దేశవ్యాప్తంగా పలు భాషల నుంచి వచ్చిన సినిమాలను పరిశీలించిన ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జ్యూరీ, అనూహ్యంగా మరాఠీ థ్రిల్లర్ చిత్రం ‘గోంధాల్‘ను ఎంపిక చేసింది. ఈ రేసులో గట్టి పోటీదారుగా నిలిచిన, బాక్సాఫీస్ వద్ద సుమారు రూ.3,000 కోట్లు వసూలు చేసిన రణ్‌వీర్ సింగ్ ‘ధురంధర్‘ ఫ్రాంచైజీకి నిరాశే ఎదురైంది.ఈ ఎంపిక ప్రక్రియలో 14 మంది సభ్యులున్న జ్యూరీలో ఒకరైన వివేక్ వాస్వానీ, ‘ఎన్డీటీవీ‘తో మాట్లాడుతూ కీలక విషయాలు వెల్లడించారు. ‘ధురంధర్‘ సినిమాను ఎందుకు ఎంపిక చేయలేదనే ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. “కొంతమంది సభ్యులకు ఆ సినిమా నచ్చింది. కానీ, అది ఆస్కార్ స్థాయి సినిమా అని మేము భావించలేదు. మేము ఆశించిన విధంగా అందులో భారతీయ సంస్కృతి ప్రతిబింబించలేదు“ అని స్పష్టం చేశారు. 14 మంది జ్యూరీ సభ్యులలో కేవలం నలుగురు మాత్రమే ‘ధురంధర్‘కు ఓటు వేశారని ఆయన తెలిపారు. మరోవైపు, భారత్ తరఫున ఆస్కార్ బరిలో నిలవనున్న ‘గోంధాల్‘ చిత్రాన్ని సంతోష్ దవాఖర్ రచించి, దర్శకత్వం వహించారు. మహారాష్ట్రలో అర్ధరాత్రి నిర్వహించే ‘గోంధాల్‘ అనే సంప్రదాయ ఆచారాలు, జానపద కళల





నేపథ్యంలో ఈ థ్రిల్లర్ రూపుదిద్దుకుంది. చిత్రంలో భారతీయ సంస్కృతిని, సంప్రదాయాలను బలంగా చూపించడం జ్యూరీని ఎంతగానో ఆకట్టుకుంది.

ఈ చిత్రం ఇప్పటికే పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రశంసలు అందుకుంది. 2025లో జరిగిన 56వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఐఎఫ్ఎఫ్ఐ)లో దర్శకుడు సంతోష్ దవాఖర్ ఉత్తమ దర్శకుడిగా సిల్వర్ పీకాక్ అవార్డును గెలుచుకున్నారు. ఈ చిత్రంలో కిషోర్ కదమ్, ఇషితా దేశ్‌ముఖ్, యోగేష్ సోహోని ప్రధాన పాత్రలు పోషించగా, ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా సంగీతం అందించారు.

ఈ ఏడాది ఆస్కార్ ఎంట్రీ కోసం మొత్తం 33 చిత్రాలు పోటీపడ్డాయి. వీటిలో 14 హిందీ, 4 మరాఠీ, 4 తెలుగు, 3 గుజరాతీ, 3 తమిళ చిత్రాలతో పాటు మలయాళం, నేపాలీ, నాగాలాండ్ నుంచి ఒక్కో సినిమా ఉన్నాయి. చివరి దశలో ‘గోంధాల్‘, ‘అంగ్‘, ‘మైనే వాపస్ ఆయుంగా‘ అనే మూడు చిత్రాలు నిలవగా, తుది ఎంపికలో జ్యూరీ ‘గోంధాల్‘ వైపే మొగ్గు చూపింది.

ఆదిత్య ధర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్ హీరోగా వచ్చిన ‘ధురంధర్‘ ఫ్రాంచైజీ, 2025 డిసెంబర్, 2026 మార్చిలో రెండు భాగాలుగా విడుదలై ప్రపంచవ్యాప్తంగా భారీ విజయం సాధించింది. అయినప్పటికీ వాణిజ్య విజయాల కన్నా సాంస్కృతిక ప్రాధాన్యతకే జ్యూరీ పెద్దపీట వేయడంతో ఈ ప్రతిష్ఠాత్మక అవకాశం మరాఠీ చిత్రానికి దక్కింది.

# జీవితంపై అమితాబ్ పాఠం..



బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ తన బ్లాగ్ వేదికగా జీవితానికి సంబంధించిన ఒక ముఖ్యమైన పాఠాన్ని పంచుకున్నారు. నిరంతర ప్రయత్నం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, జీవితంలోని సవాళ్లను ఆయన ఒక ఆటోమేటిక్ లిఫ్ట్ డోర్‌తో పోల్చారు. ఆయన వ్యక్తం చేసిన ఈ అభిప్రాయాలు ప్రస్తుతం ఎంతోమందికి స్ఫూర్తినిస్తున్నాయి.ఈ సందర్భంగా ఆయన ఒక ఆసక్తికరమైన విషయాన్ని ప్రస్తావించారు. “కొన్ని పనులు చెప్పకుండానే జరిగిపోతాయి, మరికొన్ని చెబితే జరుగుతాయి, ఇంకొన్ని కాస్త ఒత్తిడి చేస్తే గానీ పూర్తి కావు. అయితే, ఏదో ఒక మార్గంలో పని జరగడం మాత్రం ఖాయం“ అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు. దీనిని వివరిస్తూ లిఫ్ట్ డోర్ ఉదాహరణను ఆయన వివరించారు. “లిఫ్ట్ ఆటోమేటిక్ డోర్ కొద్దిసేపటి తర్వాత దానంతట అదే మూసుకుపోతుంది. మనం లోపలికి ప్రవేశించడంలో ఆలస్యం చేస్తే, అది మూసుకోబోతుంది. కానీ ఆ సమయంలో ఒక చిన్న వేలు అడ్డుపెట్టినా చాలు, అది తిరిగి తెరుచుకుంటుంది“ అని పేర్కొన్నారు.ఈ ఉదాహరణను జీవితానికి అన్వయిస్తూ.. “జీవితంలో కూడా అంతే. ఒక చిన్న ప్రయత్నం సైతం మూసుకుపోయిన తలుపులను తెరుస్తుంది. ఆ ప్రయత్నం ఒక వేలు పెట్టినంత స్వల్పమైనా సరే, ఫలితం ఉంటుంది. ప్రయత్నించకుండా ఏదీ లభించదు! నిరంతరం ప్రయత్నిస్తూనే ఉండండి... ఏదో ఒక రోజు ఆ తలుపు విసిగిపోయి తనంతట తానుగా తెరుచుకుంటుంది“ అని అమితాబ్ తన సందేశాన్ని ముగించారు. ఎంత చిన్నదైనా సరే, నిరంతరం చేసే ప్రయత్నం చివరికి మూసుకుపోయిన అవకాశాల తలుపులను సైతం తెరుస్తుందన్నదే ఆయన మాటల సారాంశం.

# ప్రతి సీన్ సర్‌ప్రైజ్ చేస్తుంది...

## ‘హతః‘ చాలా స్పెషల్: కిరణ్ అబ్బవరం



యువ హీరో కిరణ్ అబ్బవరం నటుడిగానే కాకుండా నిర్మాతగానూ ప్రయాణం సాగిస్తుండడం తెలిసిందే. ఆయన తన సొంత నిర్మాణ సంస్థ ‘కేఏ ప్రొడక్షన్స్‘ బ్యానర్‌పై పౌర్ణమి ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి ‘హతః‘ అనే చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనుష్ గోరక్ దర్శకత్వం వహిస్తున్న ఈ మిస్టికల్ థ్రిల్లర్ మూవీ టీజర్‌ను హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఘనంగా విడుదల చేశారు. నవంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా, ప్రతి ప్రేక్షకుడిని ఆశ్చర్యపరిచేలా ఉంటుందని కిరణ్ అబ్బవరం ధీమా వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ, ““హతః‘ మాకు చాలా ప్రత్యేకమైన చిత్రం. ఈ దీపావళికి ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని అందించబోతున్నాం. సినిమా చూస్తున్నంత సేపు తర్వాత ఏం జరుగుతుందనే ఉత్కంఠ ప్రతి సన్నివేశంలోనూ ఉంటుంది. సినిమా పూర్తయ్యాక, అందులోని లింక్ పాయింట్స్ గుర్తుకు తెచ్చుకోవడానికి నాకే పది నిమిషాలు పట్టింది. దర్శకుడిని అడిగి మరీ అన్ని విషయాలు తెలుసుకున్నాను. అంత లోతైన కథ ఇది. నేను నిర్మాతగా ఈ ప్రాజెక్టులోకి మధ్యలో అడుగుపెట్టాను. ప్రాంతీయ బేధాలు లేకుండా అందరూ ఆస్వాదించేలా ఈ సినిమా ఉంటుంది, అందుకే అన్ని భాషల్లోనూ విడుదల చేస్తున్నాం“ అని వివరించారు.చిత్ర దర్శకుడు అనుష్ గోరక్ మాట్లాడుతూ, “ఇది ఒక మిస్టికల్ థ్రిల్లర్. హారర్ అంశాలు కూడా ఉంటాయి. కథలో చాలా రహస్యాలు ఉన్నాయి, వాటిని థియేటర్లలో చూస్తేనే ఆ అనుభూతి దక్కుతుంది“ అని తెలిపారు. మరో నిర్మాత శివశంకర నాయుడు మాట్లాడుతూ, “ఎలాంటి ప్రాంతీయ హద్దులు లేని అరుదైన సినిమా ఇది. ఏ ప్రాంతం వారు చూసినా తమ కథలాగే అనిపిస్తుంది. సాంకేతికంగా ఉన్నత స్థాయిలో ఉంటుంది“ అని అన్నారు.బిగ్ బాస్ షోకి వెళ్లకముందే ఈ చిత్రంలో నటించానని నటి తనూజ పుట్టుస్వామి తెలిపారు. మూడేళ్ల తమ ప్రయాణం గురించి, దర్శకుడి విజన్ గురించి ఆమె వివరించారు. కో-ప్రొడ్యూసర్, నటుడు కుష్లు మాట్లాడుతూ, విజువల్స్ హాలీవుడ్ స్థాయిలో ఉన్నాయని, అనుష్ లాంటి దర్శకులు టాలీవుడ్‌కు అవసరమని అన్నారు.రెహమాన్, కుష్లు, తనూజ పుట్టుస్వామి, నమ్రిత కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని కిరణ్ అబ్బవరం సమర్పణలో శివశంకర నాయుడు నిర్మిస్తున్నారు. జేసిన్ జార్జ్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నవంబర్ 6న థియేటర్లలో ప్రేక్షకులకు సరికొత్త థ్రిల్‌ను పంచేందుకు సిద్ధమవుతోంది.

# బ్లాక్ డ్రెస్‌లో హీట్ పెంచేసిన మృణాల్ ఠాకూర్..



తెలుగు ప్రేక్షకుల గుండెల్లో సీతారామం‘తో చెరగని ముద్ర వేసుకున్న అందాల భామ మృణాల్ ఠాకూర్, తాజాగా పోస్ట్ చేసిన హాట్ పిక్స్‌తో సోషల్ మీడియాలో సెగలు రేపుతోంది. క్లాసీ బ్లాక్ డ్రెస్‌లో తనదైన స్టైల్ మార్క్ చూపిస్తూ ఈ ముద్దుగుమ్మ ఇచ్చిన పోజులు నెటిజన్లను అవాక్కయ్యేలా చేస్తున్నాయి. సింపుల్ అండ్ ఎలిగెంట్ లుక్‌లో దేవకన్యలా మెరిసిపోతున్న మృణాల్ పిక్స్ ప్రస్తుతం ఇంటర్నెట్‌లో విపరీతంగా వైరల్ అవుతూ ఫ్యాన్స్‌ను తీవ్రంగా ఆకట్టుకుంటున్నాయి.ఈ ప్రత్యేక ఫోటోషూట్ కోసం మృణాల్ ఠాకూర్ ‘షాహిన్ మన్నన్‘ బ్రాండ్‌కు చెందిన ప్యాపీ ఫ్లవర్ బ్లౌజ్ అండ్ స్టేట్‌మెంట్ స్కర్ట్ అవుట్‌ఫిట్‌ను ఎంచుకుంది. ఇక ఫుల్ స్లీవ్స్ క్రాప్డ్ బ్లౌజ్, దానికి తగ్గట్టుగా ఉన్న హై-వేస్ట్ ఫుల్లీ ఫ్లేర్డ్ స్కర్ట్‌పై కింద భాగంలో ఎరుపు రంగు పూల ఎంబ్రాయిడరీ వర్క్ ఆమె లుక్‌కు గ్రాండ్ అప్పీల్‌ను తెచ్చిపెట్టింది. నడుము వద్ద సన్నని బెల్ట్, డోప్ కట్స్‌తో మృణాల్ ఎంతో రాయల్‌గా మెరిసిపోయింది నెట్టింట లైకుల వర్షం: ఈ అద్భుతమైన పిక్స్ సోషల్ మీడియాలో పోస్ట్ చేయగానే ఫ్యాన్స్ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. “బ్రీత్‌టేకింగ్ ప్రిన్సెస్“, “అబ్సల్యూట్లీ స్టన్నింగ్ అండ్ గార్జియస్“, “బ్లాక్ కలర్‌లో నీ అందం వేరే లెవెల్“ అంటూ నెటిజన్లు పొగడ్తలతో నింపేస్తున్నారు. వెలుతురులో చిరునవ్వుతో ఉన్న మృణాల్ పిక్స్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచాయి. బుల్లితెర నుంచి స్టార్ హీరోయిన్ వరకు : మహారాష్ట్రకు చెందిన మృణాల్ ఠాకూర్, ‘కుంకుమ భాగ్య‘ సీరియల్‌తో మంచి పాపులారిటీ సాధించి, ‘లవ్ సోనియా‘ చిత్రంతో బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. ‘సుపర్ 30‘, ‘బాట్లా హౌస్‘ చిత్రాల్లో నటిగా మెప్పించిన ఈ భామ, ‘సీతారామం‘తో పాన్ ఇండియా లెవెల్లో భారీ క్రేజ్ సంపాదించుకుంది. ఇక ఆ తర్వాత ‘హాయ్ నాన్న‘, ‘జర్సీ‘, ‘ది ఫ్యామిలీ స్టార్‘ వంటి చిత్రాలతో వరుస విజయాలు అందుకుంది.! ఇక రీసెంట్ గా సిద్ధాంత్ చతుర్వేదితో కలిసి ‘దో దివానే షెహర్ మే‘, అడివి శేష్ సరసన బైలింగువల్ డ్రామా ‘డెకాయిట్: ఏ లవ్ స్టోరీ‘, వరుణ్ ధావన్‌తో కలిసి ‘హై జవానీ తో ఇష్క్ హోనా హై‘ చిత్రాల్లో నటించి మంచి సక్సెస్ అందుకుంది..ఇక తన అద్భుతమైన ఫ్యాషన్ సెన్స్‌తో పాటు విభిన్నమైన పాత్రలతో ఆకట్టుకుంటున్న మృణాల్ ఠాకూర్, రాబోయే రోజుల్లో అన్ని భాషల్లోనూ మరిన్ని భారీ విజయాలు సాధించాలని అభిమానులు కోరుకుంటున్నారు.

